E-KABURU
E-PAPER
# ఈ-కబురు
@ekaburu.com
ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం
(తేదీ) 06-08-2025 (వారం) బుధవారం
హైదరాబాద్ పేజీలు–6
e-kaburu.com



స్థానికత నిబంధనను 2028 నుంచి అమలు చేయండి » 3లో


## నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు
» 4లో



## ఆ ప్లాన్ వర్కౌట్ కానందుకే సిరాజ్ అసహనం: గిల్
» 6లో



## యాక్షన్ థ్రిల్లర్‌తో టాలీవుడ్ ఎంట్రీ ఇవ్వబో తున్న హాట్ బ్యూటీ.. లక్కీ చాన్స్ కొట్టేసిందిగా!
» 5లో



## నేడు, రేపు భారీ వర్షాలు
»



## 24 గంటల్లో భారత్‌పై మరిన్ని సుంకాలు.. మళ్లీ ట్రంప్ బెదిరింపు!



ఈ కబురు: భారత్‌పై సుంకాల పెంపు విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన స్వరాన్ని మరింత పెంచారు. రానున్న 24 గంటల్లో భారత్‌పై సుంకాలను గణనీయంగా పెంచుతామని ఓ అంతర్జాతీయ వార్తాసంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. రష్యా నుంచి భారత్ పెద్దమొత్తంలో చమురు కొనుగోలు చేస్తోందని, తద్వారా ఉక్రెయిన్ యుద్ధానికి ఆజ్యం పోస్తోందని మరోసారి తన ఆక్రోశాన్ని వెళ్లగక్కారు. భారత్‌పై సుంకాలు పెంచబోతున్నట్లుగా ట్రూత్ సోషల్ వేదికగా ట్రంప్ సోమవారం హెచ్చరించిన విషయం తెలిసిందే.

తరువాయి 2లో

# సుందర ధరాలీలో బురద వరద విలయం!

- గంగోత్రి సమీప ధరాలీ గ్రామంలో వరద బీభత్సం
- ఎగువ ప్రాంతాల నుంచి ఒక్కసారిగా ముంచెత్తిన వరదనీరు
- పలు ఇళ్లు, రెస్టారెంట్లు భూస్థాపితం.. ఐదుగురు దుర్మరణం
- సీఎం పుష్కర్‌కు ఫోన్‌చేసి పరిస్థితిపై ఆరా తీసిన ప్రధాని
- 50 మంది జాడ గల్లంతు.. వారిలో సైన్యాధికారి, 10 మంది జవాన్లు



ఈకబురు(ఉత్తరాఖండ్): ఆధ్యాత్మిక ధామాలను దర్శించే పర్యాటకులతో ప్రకృతి సోయగాలతో అలరారే రమణీయమైన హిమాలయ గ్రామం 'ధరాలీ'పై వరద విలయం కరాళ నృత్యంచేసింది. క్లౌడ్‌బరస్ట్ కారణంగా ఎగువ ప్రాంతాల నుంచి కొట్టుకొచ్చిన బురద వరద ఆ గ్రామంలోని ఇళ్లు, హోటళ్లు, రెస్టారెంట్లు, హోమ్‌స్టేలను భూస్థాపితం చేసింది. అప్పటిదాకా ప్రకృతి అందాలతో తులతూగిన ఉత్తరాఖండ్‌లోని ఆ గ్రామం ఇప్పుడు మరుభూమిని తలపిస్తోంది.ఎగువ ప్రాంతాల వరద నీరు, బురద ముంచెత్తిన దుర్ఘటనలో ఐదుగురు ప్రాణాలు కోల్పోయారని ఉత్తరకాశీ జిల్లా మేజిస్ట్రేట్ ప్రశాంత్ ఆర్య చెప్పారు. 50 మందికిపైగా జనం జాడ గల్లంతైందని స్థానికులు చెబుతున్నారు. జాతీయ భద్రత, నిఘా కార్యక్రమంలో భాగంగా సమీప హార్సిల్‌లోయ ప్రాంతంలో ఏర్పాటుచేసిన భారత ఆర్మీ 14 రాజ్‌రిఫ్ యూనిట్ బేస్‌క్యాంప్‌పైనా బురద దూసుకొచ్చింది.

తరువాయి 2లో



## హైదరాబాద్ అమరావతి రోడ్డును విస్తరించండి
» 3లో

## ప్రతిపక్షాలు తమను తామే దెబ్బతీసుకున్నాయి: మోదీ



ఈ కబురు,ఢిల్లీ: 'ఆపరేషన్ సిందూర్'పై చర్చకు పట్టుబట్టి విపక్షాలు తమను తామే దెబ్బతీసుకున్నాయని ప్రధాని మోదీ అన్నారు. చర్చల సమయంలో ప్రతిపక్ష నేతలు ప్రభుత్వం ముందు నిలవలేక ఓటమి పాలయ్యారన్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించడానికి వచ్చిన ఒకేఒక్క అవకాశాన్ని కూడా వారు వినియోగించుకోలేకపోయారని వ్యంగ్యాస్త్రాలు విసిరారు. ఆ సమయంలో దేశ భద్రత విషయంలో వారి నిర్లక్ష్య ధోరణి.. సొంత పార్టీ నేతల్లోనే అభిప్రాయ భేదాలు బయటపడ్డాయన్నారు. ఇటువంటి ప్రతిపక్ష నేతలను ఇంకెక్కడా చూడలేదన్నారు. ఎన్డీఏ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో మాట్లాడుతూ మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు. ఎప్పుడూ రాజ్యాంగం గురించి మాట్లాడే కాంగ్రెస్ నేతలు తాము అధికారంలో ఉన్నప్పుడు ఏనాడూ జమ్మూకశ్మీర్ లో దానిని అమలుచేయలేదని మోదీ విమర్శించారు. కానీ ఎన్డీఏ ప్రభుత్వం జమ్మూకశ్మీర్‌లో ఆర్టికల్ 370ని రద్దు చేసి.. రాజ్యాంగాన్ని నిజంగా అమల్లోకి తీసుకువచ్చిందన్నారు. తమను తామే దెబ్బతీసుకుంటున్నాయని అన్నారు.

తరువాయి 3లో

## 9 ఒప్పందాలపై భారత్‌ఫిలిప్పీన్స్ సంతకాలు
» 3లో





## 'కాళేశ్వరం కమిషన్ నివేదిక ట్రాష్, గ్యాస్'
» 2లో

## న్యాయ వ్యవస్థనే అవమానిస్తారా?: మంత్రి ఉత్తమ్

- కేబినెట్ ఆమోదం లేకుండానే కాళేశ్వరం చేపట్టారు
- బరాజ్‌లు ఎక్కడ కట్టాలో మీరే నిర్ణయించుకున్నారు..
- బండారం బట్టబయలైనందుకే కమిషన్‌ను తప్పు పడుతున్నారు
- ఇప్పటికైనా నాలుగు కోట్ల ప్రజలకు క్షమాపణలు చెప్పండి
- కమిషన్ నివేదికలోని అంశాలను మాత్రమే ప్రభుత్వం వెల్లడించింది
- ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టుకు హైడ్రాలజీ అనుమతులు ఇస్తే దాచి పెట్టారు



ఈ కబురు, హైదరాబాద్: 'ప్రజాస్వామ్య వ్యవస్థలపై బీఆర్‌ఎస్‌కు చులకన భావం. చట్టసభలు, న్యాయ వ్యవస్థపై గౌరవం, నమ్మకం లేదు. సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జి సారథ్యంలోని జ్యుడీషియల్ కమిషన్ అంటే కూడా లెక్కలేదు. ప్రజలు గత ఎన్నికల్లో బుద్ధి చెప్పినా ఇప్పటికీ వాళ్లలో మార్పు రాలేదు. మేడిగడ్డను కుంగబెట్టిన దుర్మార్గులు ఇప్పుడు ఏకంగా సీనియర్ జస్టిస్ పీసీ ఘోష్‌ను అవమానిస్తున్నారా? న్యాయబద్ధ కమిషన్‌కు అపార్థాలు అంటగట్టే నీచానికి దిగజారటం కూడా మీకే చెల్లింది..' అని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మండిపడ్డారు. కమిషన్ నివేదికపై బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు చేసిన ఆరోపణలను ఖండిస్తూ మంగళవారం రాత్రి ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

తరువాయి 3 లో



## జస్టిస్ భారతీయులెవరో సుప్రీంకోర్టు నిర్ణయించలేదు.. ప్రియాంకా గాంధీ
» 2లో

## ఏకపక్షం కాదు: హరీశ్‌రావు




- తెలంగాణ భవన్‌లో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తున్న హరీశ్‌రావు
- కాళేశ్వరం బరాజ్‌ల నిర్మాణం కేసీఆర్ సొంత నిర్ణయం కాదు
- ఈ ప్రాజెక్టుకు కేబినెట్‌తోపాటు అసెంబ్లీ ఆమోదం కూడా ఉంది
- పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ కార్యక్రమంలో హరీశ్‌రావు స్పష్టీకరణ
- అసెంబ్లీలో పూర్తి నివేదికను పెడితే ప్రభుత్వాన్ని చీల్చిచెండాడతాం..

ఈ కబురు, హైదరాబాద్: 'కాళేశ్వరం ప్రాజెక్టుపై వాస్తవాలు లేకుండా వండి వార్చిన నివేదికను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం బయట పెట్టింది. ఈ ప్రాజెక్టుకు కేబినెట్‌తో పాటు అసెంబ్లీ ఆమోదం కూడా ఉంది. గవర్నర్ ప్రసంగంలో కాళేశ్వరం అంశం ఉండటం కేబినెట్ ఆమోదాన్ని సూచిస్తుంది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల నిర్మాణం నాటి సీఎం కేసీఆర్ సొంత నిర్ణయం కాదు. వ్యక్తుల నిర్ణయం ఆధారంగా బరాజ్‌ల నిర్మాణం జరగలేదు. వ్యాప్కోస్ నివేదిక, హై పవర్ కమిటీ సిఫారసులు, కేబినెట్ నిర్ణయం, సీడబ్ల్యూసీ ఆమోదం మేరకు జరిగాయి. సీఎం రేవంత్‌రెడ్డి పాలనను గాలికి వదిలి రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారు. 'డబ్బులు దండుకునేందుకు కమీషన్లు..కక్ష సాధింపుల కోసం కమిషన్లు' అన్నట్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం తీరు ఉంది. తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు రేవంత్ టీవీ సీరియళ్ల తరహాలో కమిషన్లు, విచారణలతో కాలం గడుపుతున్నాడు.
కేసీఆర్‌ను హింసించాలన్నదే ఆయన ఉద్దేశం. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు కలిసి కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నాయి..' అని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. 'కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ కుట్రలు.. కమిషన్ వక్రీకరణలు, వాస్తవాలు' అనే అంశంపై మంగళవారం తెలంగాణ భవన్‌లో హరీశ్‌రావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు.

తరువాయి 2లో







## రాష్ట్ర సాధనే శ్వాసగా పోరాడిన యోధుడు జయశంకర్

» రాష్ట్ర సాధనే శ్వాసగా పోరాడిన యోధుడు జయశంకర్
» పాటతోనే ప్రజలను చైతన్యపరిచిన వ్యక్తి గద్దర్
» నేడు జయశంకర్ జయంతి, గద్దర్ వర్ధంతి సందర్భంగా వారిని గుర్తుచేసుకున్న సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, ఈ కబురు: రాష్ట్ర సాధన కోసం పోరాడిన మహనీయులు ప్రొఫెసర్ జయశంకర్, ప్రజాయుద్ధ నౌక గద్దర్ సేవలను సీఎం రేవంత్‌రెడ్డి కొనియాడారు. మంగళవారం జయశంకర్ జయంతి, గద్దర్ వర్ధంతి సందర్భంగా వారిద్దరి కృషిని గుర్తుచేసుకున్నారు. జయశంకర్ తన జీవితాన్ని రాష్ట్ర సాధ న కోసం పూర్తిగా అంకితం చేశారన్నారు. ఆయన జీవితమంతా తెలంగాణ కోసం కలలు కంటూ, ఉద్యమానికి మార్గదర్శనం చేశారని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను, స్ఫూర్తిని కొనసాగిస్తామని, అందుకు ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు.

తరువాయి2లో

మొదటి పేజీ తరువాయి

# సుందర ధరాలీలో బురద వరద విలయం

దీంతో 10 మంది జవాన్లు, ఒక సైన్యాధికారి(జూనియర్ కమీషన్డ్ ఆఫీసర్) జాడ సైతం గల్లంతైంది. తోటి జవాన్ల జాడ తెలీకుండాపోయినాసరే సడలని ధైర్యంతో ఇతర జవాన్లు సహాయక, అన్వేషణ కార్యక్రమంలో నిమగ్నమయ్యారు. నలుగురు చిన్నారులు, 11 మంది మహిళలు, 22 మంది పురుషులను ఘటనాస్థలి నుంచి సహాయక బృందాలు కాపాడాయి. డజన్ల కొద్దీ హోటళ్లు భారీ బురదలో కూరుకుపోయాయి. సమీప హెలిప్యాడ్ సైతం నాశనమైంది. మంగళవారం మధ్యాహ్నం ఉత్తరాఖండ్‌లోని ఉత్తరకాశీ జిల్లాలోని గంగోత్రీ ధామం సమీపంలోని ధరాలీ గ్రామంపైకి ఎగువ ప్రాంతాల వరద ముంచెత్తిన వీడియో దృశ్యాలు ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. హరిశీలా పర్వతం సమీపంలోని సత్‌తాల్ దగ్గరి కుంభవృష్టి కారణంగా ఒక్కసారిగా పెరిగిన ఖీర్‌గంగా నదీప్రవాహం హద్దులు దాటి దిగువక దూసుకొచ్చింది. ఈ వరదనీటితోపాటు వరద దిగువకు గంటకు 43 కిలోమీటర్ల వేగంతో కొట్టుకొచ్చి అక్కడ ఉన్న ధరాలీ గ్రామాన్ని ముంచెత్తి వినాశనం సృష్టించింది. ప్రకృతి ప్రకోపం వార్త తెల్సి ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్, అగ్నిమాపక దళం, ఉత్తరాఖండ్ పోలీసులు, భారత ఆర్మీ బలగాలు హుటాహుటిన రంగంలోకి దిగారు. ఇండో-టిబెటన్ బోర్డర్ పోలీస్ బలగాలూ ఇప్పటికే సహాయక చర్యల్లో నిమగ్నమయ్యాయి. బురదలో కూరుకుపోయిన ఇళ్ల నుంచి మట్టిని తొలగిస్తున్నారు. బురదలో చిక్కుకుపోయి కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న వారి కోసం అన్వేషణ మొదలుపెట్టారు. యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు కొనసాగిస్తున్నామని ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్‌సింగ్ ధామీ చెప్పారు. కుండపోతగా వర్షం కురుస్తుండటంతో సహాయక చర్యలకు తీవ్ర ఆటంకం తలెత్తుతోంది. ఎగువ ప్రాంతాల్లో అతి తక్కువ సమయంలో అత్యంత తీవ్రస్థాయిలో క్లౌడ్‌బరస్ట్ కుండపోత వర్షం కారణంగా ఈ బురద ముంచెత్తిందని వాతావరణశాఖ అధికారులు వివరించారు. ఘటన తర్వాత కేదార్‌నాథ్ వైపు యాత్రికుల రాకను తాత్కాలికంగా ఆపేశారు.

### దిగ్భ్రాంతి వ్యక్తంచేసిన ప్రధాని

సహాయక, అన్వేషణ చర్యల్లో పురోగతిపై ఆరా తీసేందుకు సీఎం ధామీకి ప్రధాని ఫోన్ చేశారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా సైతం ఫోన్‌చేసి వివరాలు ఆరాతీశారు. కేంద్ర ప్రభుత్వం తరఫున అదనంగా జాతీయ విపత్తు స్పందన దళం(ఎన్‌డీఆర్ఎఫ్) బలగాలను పంపిస్తున్నట్లు సీఎంకు అమిత్‌షా చెప్పారు. ''ధరాలీ దుర్ఘటనలో సర్వం కోల్పోయిన బాధితుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా. ప్రాణాలతో బయటపడిన వాళ్లు ఈ విషాదఘటన నుంచి త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నా. గ్రామస్థులకు అన్నిరకాలుగా సాయపడేందుకు మా ప్రభుత్వం సదా సిద్ధంగాఉంది''అని ప్రధాని మోదీ 'ఎక్స్'లో పోస్ట్‌చేశారు. మృతుల కుటుంబాలకు రక్షణమంత్రి రాజ్‌నాథ్, కాంగ్రెస్ చీఫ్ ఖర్గే తమ ప్రగాఢ సానుభూతి వ్యక్తంచేశారు. సహాయక చర్యల్లో నిమగ్నమై బాధితులకు సాయపడాలని స్థానిక కాంగ్రెస్ కార్యకర్తలు, నేతలకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విజ్ఞప్తిచేశారు. బాధిత కుటుంబాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణ ఆర్థిక సాయం అందించాలని కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంకాగాంధీ వాద్రా కోరారు.మెరుపు వరద ధాటికి గ్రామం చాలా వరకు ధ్వంసమైంది. ఇళ్లన్నీ బురదలో కూరుకుపోయాయి. కొండవాలు కింద ఇళ్లు నిర్మించుకున్న వాళ్లకు తప్పించుకునే అవకాశంలేకుండా పోయింది. పలువురిని బురద సజీవంగా కప్పేసింది. సమీప కొండ మీద నుంచి ఒకవ్యక్తి తీసిన వీడియో ఒకటి ఇప్పుడు వైరల్‌గా మారింది. అద్భుతం జరిగినట్లుగా ఆ బురదలోంచి ఒకరిద్దరు బయటికొచ్చి శక్తినంతా కూడదీసుకుని ముందుకు కదిలారు. అప్పటికే అలసిపోయి నాలుగు అడుగులేసి అక్కడే కుప్పకూలిపోయారు.మరో వ్యక్తి కాస్తంత బలం కూడదీసుకుని ఎగువ ప్రాంతం వైపు నడక ప్రారంభించాడు. ''నీ దగ్గర్లో పడిపోయిన ఆ వ్యక్తిని కూడా పైకి లాక్కొని రా''అని కొండ మీద జనం అరుస్తున్నట్లు ఆ వీడియోలో రికార్డయింది. ఒకతను సాయం చేయండండూ ఆ బురద మధ్యలో ఏడుస్తూ కనిపించాడు. కొందరు తమ వాళ్లకు వీడియోకాల్స్ చేసి తాము ఎక్కడ చిక్కుకుపోయామో వివరించే ప్రయత్నం చేశారు. ''అంతా ముగిసిపోయింది''అని ఒకతను మాట్లాడుతున్న వీడియో ఒకటి బయటికొచ్చింది. కొందరు ఊపిరిబిగబట్టిమరీ తమ వారి జాడ కోసం వెతుకుతూ కనిపించారు.డెహ్రాడూన్‌లో రాష్ట్ర విపత్తు నిర్వహణ కేంద్రం నుంచి సహాయక, అన్వేషణ కార్యక్రమాలను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని స్టేట్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కార్యదర్శి వినోద్ సుమన్ చెప్పారు. సమీప హార్సిల్, సుఖీ లోయ ప్రాంతాలనూ వరదనీరు ముంచెత్తే ప్రమాదం ఉండటంతో అక్కడి స్థానికులను పాలనాయంత్రాంగం అప్రమత్తంచేసింది. తక్షణం ఎగువ ప్రాంతాలకు వెళ్లాలని అధికారులు హెచ్చరించారు. ధరాలీ విలయవార్త తెలిసి సమీప దిగువ గ్రామాల్లో భయాందోళనలు నెలకొన్నాయి. సుఖీ గ్రామంలోనూ కుండపోత వర్షం కురిసింది. అక్కడ కొండచరియలు విరిగిపడడంతో హార్సిల్, ధరాలీ మధ్యలో అప్పటికప్పుడు ఒక కృత్రిమ సరస్సు ఏర్పడింది.ఇందులోని నీరు పెరిగితే దిగువ ప్రాంతాలకు కొత్త ముప్పు ఏర్పడనుంది. 20-30 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో కేవలం 60 నిమిషాల్లోపు 10 సెంటీమీటర్ల స్థాయి వర్షపాతం నమోదైతే దానిని క్లౌడ్‌బరస్ట్‌గా చెబుతారు. వీటిని ముందస్తుగా ఊహించడం చాలా కష్టం. క్లౌడ్‌బరస్ట్ కారణంగా స్వల్ప వ్యవధిలోనే అపారజలరాశి వర్షపు నీటిబిందువుల రూపంలో స్వల్పప్రాంతంలో పడటంతో అక్కడ వరద పోటెత్తుతుంది. కొండప్రాంతమైతే కొండమట్టి నీటితో తడిసిపోయి మెత్తబడి కొండచరియలు విరిగి పడతాయి. దీంతో దిగువ ప్రాంతాల్లో అపార ప్రాణ, ఆస్తినష్టం సంభవించవచ్చు.

### ప్రకృతి ఒడిలో ప్రశాంత గ్రామం

ప్రకృతి ఒడిలో ప్రశాంతంగా ఉండే ధరాలీ గ్రామం ఒక్కసారిగా మెరుపు వరదలకు పూర్తిగా కొట్టుకుపోవడంతో అసలు ఈ గ్రామం ఎక్కడుంది? అని చాలా మంది గూగుల్‌లో వెతకడం మొదలెట్టారు. యాపిల్స్‌కు ప్రసిద్ధిగాంచిన రాష్ట్రంలోని హార్సిల్ లోయ సమీపంలో ధరాలీ గ్రామం ఉంది. గంగోత్రి ధామాన్ని దర్శించే వాళ్లు కాసేపు విడిది కోసం మార్గమధ్యంలో ఉన్న ఈ గ్రామాన్ని సందర్శిస్తుంటారు. ఈ గ్రామ సమీపంలో భాగీరథి నది ప్రవహిస్తోంది. గ్రామం మీదుగా జాతీయ రహదారి వెళ్తుండటంతో ఇక్కడి పర్వతమయ ప్రకృతి సుందర దృశ్యాలను చూసేందుకు ఎక్కువ మంది యాత్రికులు ఇక్కడ ఆగుతారు.



మొదటి పేజీ తరువాయి

# ఏకపక్షం కాదు: హరీశ్‌రావు



కేసీఆర్‌ను హింసించాలన్నదే ఆయన ఉద్దేశం. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు కలిసి కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నాయి..' అని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. 'కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ కుట్రలు.. కమిషన్ వక్రీకరణలు, వాస్తవాలు' అనే అంశంపై మంగళవారం తెలంగాణ భవన్‌లో హరీశ్‌రావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో పార్టీ ముఖ్య నేతలు, రైతులు దీనిని ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. తుమ్మిడిహెట్టి నుంచి మేడిగడ్డ వద్దకు బరాజ్ మార్చడంలో నాటి సీఎం కేసీఆర్ ఏకపక్ష నిర్ణయం తీసుకున్నారంటూ కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన ఆరోపణలను హరీశ్‌రావు తీవ్రంగా ఖండించారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ పూర్తి వివరాలు ఆయన మాటల్లోనే.. కుట్ర పూరిత విచారణ!

కాళేశ్వరం ప్రాజెక్టులో ఎలాంటి రహస్యాలూ లేవు. అన్ని అంశాలు డీపీఆర్‌లో ఉన్నాయి. మేడిగడ్డ నుంచి మిడ్‌మానేరుకు నేరుగా తరలించలేమని నిపుణులు చెప్పారు. పీసీ ఘోష్ కమిషన్ విచారణ కుట్రపూరితంగా జరిగినట్లు కనిపిస్తోంది. కమిషన్ ఎదుట విచారణకు రావాలని మాకు నోటీసులు రాకముందే మీడియాలో లీకులు ఇచ్చారు. సంక్షిప్త నివేదిక పేరిట అవాస్తవాలు, రాజకీయ కక్ష సాధింపులతో 60 పేజీలు వండి వార్చారు. నచ్చిన పేరాల లీకులు, నచ్చని నాయకులు బాధ్యులు అన్నట్లుగా నివేదిక తీరు ఉంది. ఒక వైపే చూసి, విని, నిలబడి ఇచ్చిన నిరాధార నివేదిక ఇది. అసెంబ్లీలో 665 పేజీల పూర్తి నివేదికను పెడితే వాస్తవాలను నిగ్గు తేల్చేలా నిలదీసి చీల్చి చెండాడతాం.

### అనుమతుల్లేని 'కొడంగల్'కు ఎలా శంకుస్థాపన చేస్తారు?

కాళేశ్వరం ప్రాజెక్టుకు అనుమతులు ఇచ్చిన కేంద్ర ప్రభుత్వ సంస్థలను కూడా ఈ నివేదిక తప్పు పట్టింది. 11 కేంద్ర ప్రభుత్వ ఏజెన్సీలు ప్రాజెక్టును ఆమోదించాయి. ప్రాణహితకు జాతీయ హోదా ఇవ్వాలని కేసీఆర్ గతంలో ప్రధానికి లేఖ రాశారు. ఏ అనుమతులు లేని కొడంగల్ ఎత్తిపోతల పథకానికి రేవంత్ ఎలా శంకుస్థాపన చేశారు? దీనిపై కూడా అసెంబ్లీలో దుమ్ము దులిపి అన్ని ఆధారాలు బయట పెడతాం. కానీ మైక్ కట్ చేయకుండా, సభను వాయిదా వేసుకోకుండా వాస్తవాలు చెప్పే అవకాశం మాకు ఇవ్వాలి. గతంలో దేశంలో వేసిన అనేక కమిషన్ల తరహాలోనే ఈ కమిషన్ నివేదిక కూడా న్యాయస్థానం ముందు నిలవదు.

### ప్రాజెక్టును పూర్తి చేసేందుకే మేడిగడ్డకు మార్పు

తుమ్మిడిహెట్టి వద్ద ఏ ప్రాతిపదికన గతంలో బరాజ్‌ను ప్రతిపాదించారో కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పాలి. అక్కడ నీటి లభ్యత లేదని సీడబ్ల్యూసీనే చెప్పింది. అందుకే మేడిగడ్డకు మార్చాం. ప్రతిపాదిత 165 టీఎంసీల్లో ఎగువ రాష్ట్రాల వాటా ఉంది. దాన్ని కాంగ్రెస్ దాచిపెట్టింది. ప్రాణహిత-చేవెళ్లకు హైడ్రాలజీ అనుమతి ఇచ్చినట్లు కాంగ్రెస్ చెప్తోంది. కానీ 152 మీ. ఎత్తులో బరాజ్ నిర్మించవద్దని మహారాష్ట్ర స్పష్టంగా చెప్పింది.

ఈ నేపథ్యంలో ప్రాజెక్టు పూర్తి కావాలన్న ఉద్దేశంతోనే తుమ్మిడిహెట్టి నుంచి మార్చాం. తుమ్మిడిహెట్టి వద్ద 152 మీటర్ల ఎత్తున నిర్మించేందుకు ఒప్పందం చేసుకున్నట్లు నిరూపిస్తే సీఎం పదవికి రాజీనామా చేస్తానని కేసీఆర్ సవాలు చేసినా నాటి టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పందించ లేదు.

### అప్పట్లో ఖర్చు చేసింది రూ.3,700 కోట్లే..

గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం రూ.11 వేల కోట్లతో 32 శాతం ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు పనులు పూర్తి చేసినట్లు మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి చెప్పాడు. కానీ ఈ ప్రాజెక్టు కోసం నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఖర్చు చేసిన మొత్తం రూ.3700 కోట్లే. అందులోనూ మొబిలైజేషన్ అడ్వాన్సుల పేరిట రూ.2 వేల కోట్లు ఖర్చు చేశారు. కేసీఆర్ వందేళ్ల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం చేశారు. నారాయణపేట- కొడంగల్ ఎత్తిపోతల పథకానికి ఏ అనుమతి ఉందని రేవంత్‌రెడ్డి కొబ్బరికాయ కొట్టిండు. డీపీఆర్ లేకుండానే రేవంత్‌రెడ్డి పనులు ప్రారంభించాడు. ఎలాంటి అనుమతులు లేకుండానే బిల్లులు కూడా చెల్లించారు. దీనికి ఒక్క అనుమతైనా ఉంటే ఉత్తమ్ చూపించాలి. కాళేశ్వరం కూలిందని ప్రచారం చేస్తున్న రేవంత్ గందమల్ల రిజర్వాయర్‌కు కొబ్బరికాయ కొట్టి, మల్లన్నసాగర్ నుంచి మూసీకి నీళ్లు తెస్తానని టెండర్లు పిలుస్తున్నాడు. కాళేశ్వరం తెలంగాణ వరప్రదాయిని. ప్రజల గుండెల్లో కేసీఆర్ దేవుడిలా నిలుస్తారు. రాజకీయ కుట్రతోనే ఎన్‌డీఎస్ఏ నివేదిక గోదావరి నదిపై పోలవరం ప్రాజెక్టు మూడుసార్లు కుప్పకూలినా స్పందించని ఎన్‌డీఎస్ఏ మేడిగడ్డ బరాజ్‌లో చిన్న ఘటన జరగ్గానే వచ్చింది. రాజకీయ కుట్రతోనే నివేదిక ఇచ్చింది. మేడిగడ్డలో రెండు పిల్లర్లు కూలితే కేసీఆర్‌ను బాధ్యులుగా చేస్తున్నవారు పోలవరం కట్టిన ఎన్‌డీఎస్ఏ చైర్మన్ చంద్రశేఖర్ అయ్యర్‌పై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదు? పోలవరం కట్టిన ప్రధాని మోదీపై చర్య తీసుకుంటారా? శ్రీశైలం ఎడమగట్టు కాలువ సొరంగం కూలిన ఘటనకు సీఎం రేవంత్, మంత్రి ఉత్తమ్ బాధ్యత వహించాలి. అధికారంలోకి రాగానే మరమ్మతులు చేస్తాం కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తి స్థాయిలో బాగుంది. ప్రాజెక్టు ద్వారా రెండు పంటలు పండాయి. సుందిళ్ల, అన్నారం బరాజ్‌లు సురక్షితంగా ఉన్నాయని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అసెంబ్లీ వేదికగా చెప్పాడు. మేడిగడ్డలో రెండు పియర్లు కుంగితే కాళేశ్వరం కూలిందని తప్పుడు ప్రచారం చేశారు. బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి వచ్చిన తర్వాత కుంగిన రెండు పియర్లను బాగు చేసి కాళేశ్వరం ప్రాజెక్టును తెలంగాణకు వరప్రదాయని అని నిరూపిస్తాం.

# 'కాళేశ్వరం కమిషన్ నివేదిక ట్రాష్, గ్యాస్'



ఈ కబురు,న్యూఢిల్లీ: ఈవీఎంలు వద్దు పేపర్ బ్యాలెట్ విధానాన్ని తిరిగి ప్రవేశ పెట్టాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. ఎన్నికల నిర్వహణ, సంస్కరణలపై అన్ని రాజకీయ పార్టీలతో కేంద్ర ఎన్నికల సంఘం సమావేశాలు నిర్వహిస్తుంది. ఇందులో భాగంగా ఢిల్లీలో ఈసీ సమావేశానికి బీఆర్ఎస్ నుంచి కేటీఆర్‌తో పాటు ఇతర పార్టీ నేతలు హాజరయ్యారు. ఈసీతో సమావేశం అనంతరం, కేటీఆర్ మీడియాతో మాట్లాడారు.'పేపర్ బ్యాలెట్ విధానాన్ని తిరిగి ప్రవేశపెట్టాలి. బీహార్ ఎన్నికల నుంచే పేపర్ బ్యాలెట్‌తో ఎన్నికల జరపాలి. ఈవీఎంలపై అనేక అనుమానాలు ఉన్నాయి. అనేక దేశాలు బ్యాలెట్ విధానంతోనే ఎన్నికలు నిర్వహిస్తున్నాయి.కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలపై బాండ్ పేపర్లతో ప్రజలను వంచించింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉండకపోతే ప్రజలు శిక్షించేలా ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవాలి. హామీలు నెరవేర్చకపోతే సభ్యత్వం రద్దు చేయాలి. బీహార్ ప్రత్యేక ఓటర్ సవరణ పై కూడా చర్చ జరిపాం. ఓటర్లను ఉద్దేశపూర్వకంగా తీసేయలేదు అని ఎన్నికల సంఘం చెప్పింది. ఓటరు జాబితా సవరణ మంచిదే కానీ అందరి విశ్వాసాన్ని పరిగణలోకి తీసుకొని చేయాలి. అన్ని పార్టీలను భాగస్వామ్యం చేయాలని పిలుపునిచ్చారు.అదే సమయంలో కాళేశ్వరం కమిషన్ నివేదికపై చర్చించేందుకు జరగనున్న తెలంగాణ అసెంబ్లీ సమావేశాలపై స్పందించారు. కాళేశ్వరం కమిషన్ నివేదిక ట్రాష్, గ్యాస్. కాళేశ్వరం కమిషన్ నివేదికలో 650 పేజీల్లో ఉన్న నివేదికను 60 పేజీల్లోకి కుదించి అసెంబ్లీలో పెడతామని అంటున్నారు. అసెంబ్లీలో మైకు కట్ చేయకుండా ఉంచితే కాంగ్రెస్ ను చీల్చి చెండాడుతాం. దురుద్దేశంతో మాపై ప్రచారం చేస్తున్నారు. కేసీఆర్ ,బీఆర్ఎస్‌పై దుష్ప్రచారం. మొత్తం నివేదికను బయట పెట్టాలి.అసెంబ్లీలో నివేదిక పెట్టాలి.బీసీల కు ఇచ్చిన హామీలు ఎందుకు అమలు చెయ్యడం లేదు. సబ్ ప్లాన్ ఎందుకు పెట్టరు. మీ చేతుల్లో ఉన్న పనులు ముందు చెయ్యండి. ఢిల్లీలో డ్రామాలు చేస్తే ఎవ్వరు నమ్మరు'అని ఎద్దేవా చేశారు.

మొదటి పేజీ తరువాయి

# 24 గంటల్లో భారత్‌పై మరిన్ని సుంకాలు.. మళ్లీ ట్రంప్ బెదిరింపు!




ఈ కబురు: భారత్‌పై సుంకాల పెంపు విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన స్వరాన్ని మరింత పెంచారు. రానున్న 24 గంటల్లో భారత్‌పై సుంకాలను గణనీయంగా పెంచుతామని ఓ అంతర్జాతీయ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. రష్యా నుంచి భారత్ పెద్దమొత్తంలో చమురు కొనుగోలు చేస్తోందని, తద్వారా ఉక్రెయిన్ యుద్ధానికి ఆజ్యం పోస్తోందని మరోసారి తన ఆక్రోశాన్ని వెళ్లగక్కారు. భారత్‌పై సుంకాలు పెంచబోతున్నట్లుగా ట్రూత్ సోషల్ వేదికగా ట్రంప్ సోమవారం హెచ్చరించిన విషయం తెలిసిందే.''వాణిజ్యం విషయంలో భారత్ మంచి భాగస్వామి కాదు. ఆ దేశం మాతో పెద్దమొత్తంలో వ్యాపారం చేస్తోంది. కానీ.. మేం మాత్రం ఆ స్థాయిలో చేయడం లేదు. కాబట్టి.. 25శాతం సుంకాలు విధించాం. రానున్న 24 గంటల్లో దీన్ని గణనీయంగా పెంచబోతున్నాం. ఎందుకంటే.. వారు రష్యా నుంచి భారీ స్థాయిలో చమురును కొనుగోలు చేస్తున్నారు. తద్వారా ఉక్రెయిన్ యుద్ధానికి ఆజ్యం పోస్తున్నారు'' అని ట్రంప్ పేర్కొన్నారు. రష్యా నుంచి చమురు కొనుగోళ్లపై అమెరికా, ఐరోపా దేశాల అభ్యంతరాలను భారత్ ఇప్పటికే గట్టిగా తిప్పికొట్టింది. అణు పరిశ్రమ, విద్యుత్ వాహనాలు, ఎరువుల తయారీకి అవసరమైన పదార్థాలను రష్యా నుంచి అగ్రరాజ్యం దిగుమతి చేసుకోవడాన్ని ప్రశ్నించింది. మరోవైపు.. అమెరికా వైఖరిపై రష్యా సైతం మండిపడింది. భారత్‌పై వాణిజ్యపరంగా ఒత్తిడిని పెంచుతోందని విమర్శించింది. సార్వభౌమ దేశాలకు తమ వాణిజ్య భాగస్వాములను సొంతంగా ఎంచుకునే హక్కు ఉంటుందని స్పష్టం చేసింది.

మొదటి పేజీ తరువాయి

# న్యాయ వ్యవస్థనే అవమానిస్తారా?: మంత్రి ఉత్తమ్



### వారి బండారం బట్టబయలైంది

'కాళేశ్వరం ప్రాజెక్టు పేరిట గత ప్రభుత్వం ఎన్ని అవకతవకలకు, అక్రమాలకు పాల్పడిందో కమిషన్ విచారణలో బయటపడింది. అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్, ఆనాటి ఇరిగేషన్ మంత్రి హరీశ్‌రావు బండారం బట్టబయలైంది. అందుకే తేలు కుట్టిన దొంగల్లా.. హరీశ్‌రావు మళ్లీ కల్లొ ల్లి కబుర్లు చెప్తున్నారు. కమిషన్ ఇచ్చిన నివేదికలోని అంశాలను మాత్రమే ప్రభుత్వం వెల్లడించింది. అది రేవంత్‌రెడ్డి ఉత్తమ్‌కుమార్ రెడ్డి రాసిన రిపోర్టు కాదనే విషయాన్ని హరీశ్‌రావు మరిచిపోయినట్లున్నారు.

### ఇంకెన్ని సార్లు మోసం చేస్తారు..

కాళేశ్వరం ప్రాజెక్టు ఆలోచన మొదలైనప్పటి నుంచి డిజైన్లు, నిర్మాణంలో లోపాలు, మేడిగడ్డ బరాజ్ కుంగుబాటు వరకు అవకతవకలన్నింటిపై కమిషన్ సమగ్రంగా విచారణ జరిపింది. ఎవరెవరు తప్పులు చేశారో.. ఎవరెవరు అందుకు బాధ్యులనే వివరాలను నివేదికలో వెల్లడించింది. మేమేం తప్పు చేయలేదంటూ మీ పార్టీ ఆఫీసులో తప్పులు మాట్లాడి తెలంగాణ ప్రజలను ఇంకెన్ని సార్లు మోసం చేస్తారు? ఇప్పుడు పార్టీ ఆఫీసులో పెడబొబ్బలు పెడుతున్న హరీశ్‌రావు.. ఆరోజు కమిషన్ ముందు ఎందుకు ఈ వివరాలు చెప్పుకోలేదు?..' అని ఉత్తమ్ నిలదీశారు.

### ప్రభుత్వం చర్యలపై భయం పట్టుకుంది..

'హరీశ్ అబద్ధపు సాక్ష్యాలు, బుకాయింపులన్నీ.. న్యాయ వ్యవస్థ ముందు అబద్ధాలుగా తేలిపోయాయి. ఆయన చేసిన తప్పులన్నీ బయటపడ్డాయి. కేసీఆర్ పాత్ర ఏమిటో, హరీశ్‌రావు చేసిన ఘనకార్యాలేమిటో కమిషన్ విచారణలో తేలిపోయాయి. దాంతో ఇప్పుడు ప్రభుత్వం ఈ నివేదికపై ఎలాంటి చర్యలు తీసుకుంటుందనే భయం వాళ్లను వెంటాడుతోంది. అందుకే కమిషన్‌ను తప్పుబట్టే దుర్మార్గానికి ఒడిగట్టారు.

### అసెంబ్లీలో చర్చించేందుకు సిద్ధం

ప్రజాస్వామ్య వ్యవస్థలు, న్యాయ వ్యవస్థలు, చట్ట సభలపై మా ప్రభుత్వానికి గౌరవముంది. అందుకే అసెంబ్లీలో ఈ నివేదికపై చర్చించేందుకు సిద్ధంగా ఉంది. కాళేశ్వరంలో దోషులుగా తేలిన బాధ్యులు.. అసెంబ్లీకి వచ్చి చర్చలో పాల్గొనాలని కూడా ప్రభుత్వం ఆహ్వానించింది.

ఫార్మ్ హౌస్‌లో మామ డైరెక్షన్, పార్టీ ఆఫీస్‌లో అల్లుడి యాక్టింగ్ ఇకనైనా ఆపాలి. ఇప్పటికైనా అసెంబ్లీకి వచ్చి చేసిన తప్పులు ఒప్పుకుని నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలకు క్షమాపణలు చెప్పుకోవాలి. మీరు వేలకోట్ల అవినీతి చేస్తే ఒప్పు,.. మేం విచారణ చేసి నిజాలు నిగ్గుతేలిస్తే అది రాజకీయ కక్ష సాధింపా?..' అని మంత్రి ప్రశ్నించారు.

### బీఆర్ఎస్ నేతలకు మాట్లాడే హక్కే లేదు..

'కమీషన్ల కక్కుర్తితో ప్రజలను, రైతులను పదేళ్ల పాటు మోసం చేశారు, ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టుకు హైడ్రాలజీ అనుమతులు ఇస్తే దాచిపెట్టారు. నిపుణుల కమిటీ మేడిగడ్డ వద్ద బరాజ్‌ల నిర్మాణం వద్దని చెపితే తొక్కిపెట్టారు. బరాజ్‌లు ఎక్కడ కట్టాలో మీరే నిర్ణయించుకున్నారు. కుంగి పోయే ప్రాజెక్టు కట్టినందుకు సిగ్గుపడాల్సింది పోయి హరీశ్‌రావు కొత్త రికార్డు సృష్టించారు. జనం చెవిలో పువ్వులు పెట్టే ప్రయత్నం చేశారు. ఒక్క మాట కూడా నిజం చెప్పకుండా మరోసారి డూప్ ప్రజెంటేషన్ ఇచ్చారు. నారాయణపేట కొడంగల్ ప్రాజెక్టుకు ఉమ్మడి రాష్ట్రంలోనే జీవో ఇచ్చారు. మా ప్రభుత్వం ఒక్క రూపాయి బిల్లు కూడా ఇప్పటివరకు ఆ ప్రాజెక్టు కాంట్రాక్టర్లకు ఇవ్వలేదు. కేబినెట్ ఆమోదం లేకుండానే మామా అల్లుళ్లు సంతకాలు చేసుకుని కాళేశ్వరం ప్రాజెక్టు కట్టి.. తెలంగాణ ప్రజలను దగా చేశారు. తెలంగాణ ప్రయోజనాలను పాతరపెట్టి, ఆర్థికంగా లక్ష కోట్ల దుర్మార్గానికి ఒడిగట్టిన బీఆర్ఎస్ నేతలకు నైతికంగా మాట్లాడే హక్కే లేదు..' అని ఉత్తమ్ విమర్శించారు.

# జమైన భారతీయులెవరో సుప్రీంకోర్టు నిర్ణయించలేదు.. ప్రియాంకా గాంధీ

ఈ కబురు: భారత సైన్యంపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసినందుకు గాను కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ పై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేయడంపై రాహుల్ సోదరి ప్రియాంక గాంధీ స్పందించారు. నిజమైన భారతీయులెవరో సుప్రీంకోర్టు నిర్ణయించలేదన్నారు. ఆ విషయం న్యాయమూర్తుల పరిధిలోకి రాదని తెలిపారు. బుధవారం ఆమె పార్లమెంట్ ప్రాంగణంలో మీడియాతో మాట్లాడారు. రాహుల్‌కు సైన్యం పట్ల గౌరవం ఉందని, ఏనాడూ ఆర్మీకి వ్యతిరేకంగా మాట్లాడలేదని స్పష్టం చేశారు. లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడిగా, ప్రభుత్వాన్ని ప్రశ్నలు అడగడం రాహుల్ గాంధీ విధి అని తెలిపారు. రాహుల్ మాటలను తప్పుగా అర్థం చేసుకున్నారని చెప్పారు.న్యాయమూర్తుల పట్ల గౌరవం ఉందని కానీ నిజమైన భారతీయులెవరో వారు గుర్తించలేరని తెలిపారు. కాగా, భారత్ జోడో యాత్ర సందర్భంగా భారత సైన్యంపై రాహుల్ అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ పిటిషన్ దాఖలు కాగా దీనిపై విచారించిన సుప్రీంకోర్టు రాహుల్‌పై ఆగ్రహం వ్యక్తం చేసింది.

మొదటి పేజీ తరువాయి

# రాష్ట్ర సాధనే శ్వాసగా పోరాడిన యోధుడు జయశంకర్

హైదరాబాద్, ఈ కబురు: రాష్ట్ర సాధన కోసం పోరాడిన మహనీయులు ప్రొఫెసర్ జయశంకర్, ప్రజాయుద్ధ నౌక గద్దర్ సేవలను సీఎం రేవంత్‌రెడ్డి కొనియాడారు. మంగళవారం జయశంకర్ జయంతి, గద్దర్ వర్ధంతి సందర్భంగా వారిద్దరి కృషిని గుర్తుచేసుకున్నారు. జయశంకర్ తన జీవితాన్ని రాష్ట్ర సాధన కోసం పూర్తిగా అంకితం చేశారన్నారు. ఆయన జీవితమంతా తెలంగాణ కోసం కలలు కంటూ, ఉద్యమానికి మార్గదర్శనం చేశారని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను, స్ఫూర్తిని కొనసాగిస్తామని, అందుకు ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు.అలాగే తెలంగాణ సాధన ఉద్యమానికి గద్దర్ ఆయువుపట్టుగా నిలిచారని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. పాటనే తన ఆయుధంగా మలుచుకుని ప్రజలను చైతన్య పరిచారని గుర్తు చేసుకున్నారు. తెలంగాణ మలి దశ ఉద్యమానికి ఊపిరి పోసిన వారిలో గద్దర్ అగ్రగణ్యుడని, ఆయన నమ్మిన సిద్ధాంతాల కోసం చివరి వరకు పోరాడారని తెలిపారు. కాగా, రాష్ట్ర సాధన కోసం మలి దశ ఉద్యమ పోరాటంలో జయశంకర్ అందించిన స్ఫూర్తి మరువలేనిదని బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ అన్నారు.







# నిబంధనలకు విరుద్ధంగా

## నిర్మాణ సంస్థ బ్లాస్టింగ్

**స్కూల్ మీద ఎగిరిపడిన బండరాళ్లు**

**పలువురు విద్యార్థులకు స్వల్ప గాయాలు**

ఈకబురు, శేరిలింగంపల్లి : నిబంధనలకు విరుద్ధంగా ఓ బహుళ అంతస్థుల నిర్మాణ సంస్థ చేపట్టిన బ్లాస్టింగ్ పక్కనే స్కూల్లో చదువుకుంటున్న విద్యార్థులను ప్రమాదంలోకి నెట్టింది. బ్లాస్టింగ్ కారణంగా బండరాళ్లు ఎగిరి స్కూల్ మీద పడడంతో పలువురు విద్యార్థులకు స్వల్ప గాయాలు అయ్యాయి. ఈ విషయమై స్కూల్ నిర్వాహకులు గచ్చిబౌలి పోలీసులకు పిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. కొండాపూర్ లో నూతనంగా నిర్మాణం చేపడుతున్న సమిశ్రీ నిర్మాణ సంస్థ సెల్లార్ తవ్వకం చేపట్టింది. సెల్లార్ తవ్వకంలో భాగంగా బండరాళ్లు రావడంతో వాటిని పగులగొట్టేందుకు మంగళవారం మధ్యాహ్నం 12.30 గంటల ప్రాంతంలో బ్లాస్టింగ్ చేపట్టింది. కంట్రోల్డ్ బ్లాస్టింగ్ చేపట్టాల్సి ఉండగా, నిబంధనలకు విరుద్ధంగా బ్లాస్టింగ్ చేపట్టడంతో ఒక్కసారిగా బండరాళ్లు ఎగిరిపడి పక్కనే ఉన్న చిరాక్ ఇంటర్నేషనల్ స్కూల్ మీద పడ్డాయి. ఆ సమయంలో కొంతమంది విద్యార్థులు గ్రౌండ్ లో ఆడుకుంటుండగా, లంచ్ సమయం కావడంతో మరికొంతమంది ఆరుబయట ఉన్నారు. ఒక్కసారిగా దూసుకువచ్చిన బండరాళ్లతో భయాందోళనకు గురైన విద్యార్థులు తరగతి గదుల్లోకి పరుగులు తీశారు. బండరాళ్లు పడడం, విద్యార్థులు పరుగులు తీయడంతో పలువురు విద్యార్థులకు స్వల్ప గాయాలు అయ్యాయి, బ్లాస్టింగ్ రాళ్లు పడడంతో స్కూల్ యజమాన్యం విద్యార్థుల తల్లిదండ్రులకు సమాచారం అందించినట్లు తెలుస్తుంది. మరోవైపు నమిశ్రీ నిర్మాణ సంస్థ సరైన జాగ్రత్తలు తీసుకోకుండా బ్లాస్టింగ్ చేపట్టడంతో బండరాళ్లు తమ స్కూల్ మీద పడ్డాయని చిరాక్ స్కూల్ వైస్ ప్రిన్సిపాల్ రంజిత్ గచ్చిబౌలి పోలీసులకు పిర్యాదు చేశాడు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. కాగా విద్యార్థులు గాయపడినట్లు ఎటువంటి పిర్యాదు రాలేదని పోలీసులు తెలిపారు.

# ప్రతిపక్షాలు తమను తామే దెబ్బతీసుకున్నాయి: మోదీ

ఎప్పుడూ రాజ్యాంగం గురించి మాట్లాడే కాంగ్రెస్ నేతలు తాము అధికారంలో ఉన్నప్పుడు ఏనాడూ జమ్మూకశ్మీర్ లో దానిని అమలుచేయలేదని మోదీ విమర్శించారు. కానీ ఎన్డీఏ ప్రభుత్వం జమ్మూకశ్మీర్‌లో ఆర్టికల్ 370ని రద్దు చేసి.. రాజ్యాంగాన్ని నిజంగా అమల్లోకి తీసుకువచ్చిందన్నారు. తమ ప్రభుత్వం ఆర్టికల్ 370 రద్దు, రామమందిర నిర్మాణం, ఆపరేషన్ సిందూర్ వంటి చరిత్రాత్మక నిర్ణయాలు తీసుకుంటుంటే ప్రతిపక్షాలు మాత్రం తమ చర్యలతో తమను తామే దెబ్బతీసుకుంటున్నాయని అన్నారు. పహల్గాం దాడి, ఆపరేషన్ సిందూర్‌లపై లోక్‌సభలో ఇటీవల చర్చలు జరిగిన విషయం తెలిసిందే. చర్చల్లో విపక్షాలు ఉభయసభల్లో ప్రభుత్వాన్ని నిలదీశాయి. ముఖ్యంగా భద్రతలో, విదేశాంగ విధానంలో వైఫల్యాలను ప్రస్తావించి ప్రభుత్వ జవాబుదారీతనాన్ని ప్రశ్నించాయి. విపక్ష నేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ తదితరులు ప్రభుత్వంపై విరుచుకుపడగా.. అధికార పక్షం వైపు నుంచి కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్, మరో మంత్రి నడ్డాలు వారి విమర్శల్ని గట్టిగా తిప్పికొట్టారు. దీంతో ఉభయసభల్లో వాగ్వాదాలు చోటుచేసుకున్నాయి. చివర్లో మోదీ సవివరంగా స్పందించి.. విపక్షాల పాలనలో జరిగిన తప్పిదాలను తనదైన శైలిలో ప్రస్తావించారు. ఉగ్రవాదుల ఏరివేతలో ఆపరేషన్ సిందూర్, ఆపరేషన్ మహాదేవ్ కీలకపాత్ర పోషించాయని స్పష్టంచేశారు. భారత్‌పాక్ యుద్ధాన్ని నిలువరించినట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పదేపదే చెప్పడంపై విపక్షాల విమర్శలకు సమాధానమిచ్చారు. ఆ సమావేశాల్లో విపక్షాల తీరును నేడు నిర్వహించిన ఎన్డీఏ సమావేశంలో మోదీ విమర్శించారు.



# అవసరమైతే మళ్లీ రాజీనామా!



**మునుగోడు ప్రజల కోసం ఏ త్యాగమైనా చేస్తా**

**గతంలో రాజీనామా చేస్తే ప్రభుత్వమే దిగొచ్చింది**

**పదవులు, పైసలు ముఖ్యమంత్రే తీసుకుపోతున్నారు**

**మంత్రి పదవి ఇస్తామని హామీ ఇచ్చారు.. ఇక వారి ఇష్టం**

**ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యలు**

సంస్థాన్ నారాయణపురం, ఈ కబురు: మంత్రి పదవికి సంబంధించి మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. అవసరమైతే ఎమ్మెల్యే పదవికి మళ్లీ రాజీనామా చేసేందుకు సిద్ధమన్న సంకేతాలిచ్చారు. గతంలో రాజీనామా చేస్తే ప్రభుత్వమే మునుగోడు ప్రజల వద్దకు దిగివచ్చిందన్నారు. మంత్రి పదవి ఇస్తామని కాంగ్రెస్ పెద్దలు తనకు హామీ ఇచ్చారని, ఇస్తారో లేదో ఇక వారి ఇష్టమేనని వ్యాఖ్యానించారు. మంగళవారం యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం లచ్చమ్మగూడెం వద్ద విద్యుత్ సబ్‌స్టేషన్‌కు రాజగోపాల్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "నాకు కావాల్సింది మునుగోడు నియోజకవర్గ ప్రజలు.. వారి బాగోగులే. నాకు మంచి జరిగితే వాళ్లకు మంచి జరుగుతుంది. వాళ్ల అభివృద్ధి, సంక్షేమం కోసం ఎంతదూరమైనా వెళతా.. ఏ త్యాగమైనా చేస్తా. పోయినసారి నేను రాజీనామా చేస్తే బీఆర్ఎస్ ప్రభుత్వం, 100మంది ఎమ్మెల్యేలు మునుగోడు ప్రజల కాళ్లవద్దకు రాలే దా? మళ్లీ అంతదూరమైనా వెళతా" అని అన్నారు. తాను ఏదైనా మాట్లాడితే మంత్రి పదవి రాలేదు కాబట్టి మాట్లాడుతున్నా అంటున్నారని తప్పుబట్టారు. మంత్రి పదవే కావాలనుకుంటే ఎల్బీనగర్‌లో పోటీ చేస్తే వచ్చేదని, కానీ.. తనకు మునుగోడు ప్రజలు, ఈ ప్రాంత అభివృద్ధి ముఖ్యమని, అందుకే ఇక్కడే పోటీ చేశానని చెప్పారు. తనను ఎవరైనా 'మంత్రి పదవి కావాలా? మునుగోడు ప్రజలు కావాలా?' అని అడిగితే మునుగోడు ప్రజలు, వారి అభివృద్ధినే కోరుకుంటానని స్పష్టం చేశారు.

పెద్ద పదవి వస్తే ప్రజలకే ఉపయోగం..

తాను పదవుల కోసం పాకులాడే వాడిని కాదని రాజగోపాల్‌రెడ్డి అన్నారు. అదృష్టం ఉండి ఇంతకంటే పెద్ద పదవి వస్తే అది ప్రజలకే ఉపయోగపడుతుందన్నారు. అంతే తప్ప పెద్ద పెద్ద పదవులు అడ్డం పెట్టుకుని పైరవీలు చేసుకొని వేల కోట్లు దోచుకునే వాడిని కాదన్నారు. ప్రజల కోసమే పార్టీ మారి కాంగ్రెస్‌లోకి వచ్చానని తెలిపారు. మంత్రి పదవి ఇస్తామని హామీ ఇచ్చారని, పదవి ఇస్తారో.. ఇవ్వరో వారి ఇష్టమన్నారు. తాను కూడా సీనియర్‌ను, తెలంగాణ ఉద్యమంలో ఉన్నవాడినని అన్నారు. తన కన్నా జూనియర్లకు, నిన్న మొన్న పార్టీ మారి వచ్చినవాళ్లకు పదవులు ఇచ్చారని గుర్తు చేశారు. పార్టీలోకి రమ్మంటే నమ్ముకుని వచ్చామని, ఎంపీని గెలిపించమంటే గెలిపించామని, తనకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని కోరారు. పదవులు, పైసలు ఆయనే (సీఎం రేవంత్‌రెడ్డి) తీసుకుపోతున్నారని, పదవులు లేకున్నా కనీసం పైసలన్నా మునుగోడు నియోజకవర్గానికి రావాలి కదా! అని రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యానించారు. కొడంగల్ నియోజకవర్గానికి రూ.5 వేల కోట్ల నిధులు తీసుకుపోయినప్పటి నుంచి తనకు నిద్రపట్టడం లేదన్నారు. మునుగోడు అభివృద్ధి రాజీ పడకూడదని నిర్ణయించుకున్నట్లు తెలిపారు.

# ట్యాంకర్ వెళుతుండగా కూలిన నాలా స్లాబ్!



**ఈ కబురు,బంజారాహిల్స్ రోడ్ నం.1కు ఆనుకుని ఉన్న కాలనీలో మంగళవారం వేకువజామున నాలా ప్రమాదం చోటుచేసుకుంది. నీళ్ల ట్యాంకర్ ప్రయాణిస్తుండగా.. బలహీనంగా ఉన్న భూగర్భ వరద నాలా స్లాబు కూలిపోయింది. వాహనం అందులో దిగబడిపోయింది. ఒక్కసారిగా.. భారీ శబ్దం రావడంతో స్థానికులు హడలెత్తిపోయారు. జీహెచ్ఎంసీ అధికారులు, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వాహనంలో చిక్కుకుపోయిన డ్రైవర్, సహాయకుడిని బయటకు తీసి ఆస్పత్రికి తరలించారు. 'బంజారాహిల్స్ రోడ్ నం.1 నుంచి మహేశ్వరి టవర్స్‌కు రహదారి కింద దశాబ్దాల నాటి వరద నాలా ఉంది. పాత కాలం నాలా అవడంతో.. స్లాబు దెబ్బతింది. సోమవారం నాటి కుండపోత వానతో మరింత బలహీనపడింది. మర్నాడే ట్యాంకరు దాని మీదుగా వెళ్లడంతో ప్రమాదం చోటుచేసుకుంది' అని అధికారులు వివరించారు. నాలా దెబ్బతిన్న విషయాన్ని ముందే ఊహించి.. రోడ్డుకు అడ్డుగా కర్రలు ఏర్పాటు చేశామని, వాటిని గమనించకుండా లారీ ముందుకెళ్లినట్లు ఉందని స్థానికులు తెలిపారు. నాలా మీదుగా ఈ కాలనీ దాకా క్రేన్‌ను తీసుకొచ్చి ఈ వాహనాన్ని వెలికితీసే ప్రయత్నం చేస్తే మళ్లీ అది కూడా ఇలా ఎక్కడన్నా దిగబడిపోవచ్చని అధికారులు ఆలోచిస్తున్నారు. ప్రధాన రహదారి నుంచే భారీ క్రేన్‌తో ట్యాంకర్‌ను తొలగించాల్సి ఉంటుందని భావిస్తున్నారు. మంగళవారం అర్ధరాత్రి వరకు ట్యాంకర్‌ను తొలగించే పనులు కొనసాగాయి.**

# స్థానికత నిబంధనను 2028 నుంచి అమలు చేయండి

**తెలంగాణకు సుప్రీంకోర్టు సూచన**

**రాష్ట్ర ప్రభుత్వ పిటిషన్‌లో ముగిసిన విచారణ.. తీర్పు రిజర్వు చేసిన ధర్మాసనం**



ఈ కబురు, ఢిల్లీ: ఎంబీబీఎస్‌లో స్థానిక కోటా కింద ప్రవేశాలు పొందాలనుకున్న విద్యార్థులు నీట్ రాయడానికి ముందు నాలుగేళ్లు వరుసగా తెలంగాణలో చదివి ఉండాలని జారీ చేసిన నిబంధనలను తప్పుబడుతూ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌లో జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ విక్రమ్‌చంద్రన్‌లతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం తీర్పు రిజర్వు చేసింది. మంగళవారం వాదనలను విన్న అనంతరం విచారణను ముగిస్తున్నట్లు ప్రకటించింది. ఇంకేమైనా వాదనలుంటే శుక్రవారంలోపు లిఖితపూర్వకంగా సమర్పించాలని ఆదేశించింది. స్థానికత సమస్యకు ప్రభుత్వమే పరిష్కార మార్గాలను చూపాలని, లేదంటే పిటిషన్‌ను డిస్మిస్ చేస్తామని ప్రధాన న్యాయమూర్తి( సీజేఐ) జస్టిస్ గవాయ్ గత నెల 23న విచారణ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మంగళవారం జరిగిన విచారణ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది గోపాల్‌శంకర్ నారాయణన్ పరిష్కార మార్గాలు చెప్పకుండా తాము వాదనలు వినిపించాలనుకుంటున్నట్లు ధర్మాసనానికి చెప్పారు.దాంతో విచారణ ముగించి... "తెలంగాణ శాశ్వత నివాసులైన విద్యార్థులు ఇంటర్ పరీక్షలను తెలంగాణలో రాయకపోయినా ఎంబీబీఎస్ ప్రవేశాలకు అనుమతివ్వాలి" అని మధ్యంతర ఉత్తర్వులను జారీ చేయడానికి సీజేఐ సిద్ధమయ్యారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వ న్యాయవాది స్పందిస్తూ... ధర్మాసనం అలాంటి ఉత్తర్వులు జారీ చేయడానికి ముందు తమ వాదనలు వినాలని అభ్యర్థించారు. అందుకు సీజేఐ అంగీకరించారు. దీంతో సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ వాదనలు వినిపించారు. "ఒక్కో ఎంబీబీఎస్ సీటు కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.కోటి ఖర్చుపెడుతోంది. ఆ ప్రయోజనాలను స్థానికంగా చదివిన పేద, మధ్య తరగతి విద్యార్థులకు కల్పించాలన్న ఉద్దేశంతోనే వరుసగా నాలుగేళ్లు రాష్ట్రంలో చదివి ఉండాలన్న నిబంధన తీసుకొచ్చింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 371డీని అనుసరించే ఈ నిబంధన తీసుకొచ్చాం. కర్ణాటక, అస్సాం, హరియాణాల్లోనూ ఇలాంటి నిబంధనలు ఉన్నాయి" అని అభిషేక్ సింఘ్వీ వివరించారు.తెలంగాణ ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి హాజరై అంతర్రాష్ట్ర బదిలీలకు అవకాశం ఉండే అఖిల భారత సర్వీసు ఉద్యోగులు, న్యాయమూర్తులు, ప్రభుత్వరంగ సంస్థల ఉద్యోగులు, సైనిక దళాలు, పారామిలిటరీ దళాల్లో పనిచేసే వారి పిల్లలకు ఈ నిబంధన నుంచి వెసులుబాటు కల్పిస్తామని హామీ పత్రాన్ని ధర్మాసనానికి సమర్పించారు. విద్యార్థులను ముందే హెచ్చరించాలి: సీజేఐ రాష్ట్ర ప్రభుత్వ వాదనలపై జస్టిస్ గవాయ్ పలు ప్రశ్నలు సంధించారు. "రాష్ట్రంలో పుట్టిన/ పదో తరగతి వరకు చదివిన/తల్లిదండ్రులు ఇక్కడే శాశ్వత నివాసం ఉన్న విద్యార్థి వేరే రాష్ట్రాల్లో ఇంటర్ చదివారన్న కారణంతో ప్రవేశాలను నిరాకరించవచ్చా? జేఈఈ, నీట్ శిక్షణ నిమిత్తం రాజస్థాన్‌లోని కోటాకు దేశం నలుమూలల నుంచీ విద్యార్థులు వెళ్తుంటారు. అలా వెళ్లినవారి పరిస్థితి ఏంటి? ఉదాహరణకు తెలంగాణకు ఐఏఎస్ అధికారి డిప్యుటేషన్‌పై ఢిల్లీకొచ్చినప్పుడు ఆయన కుమారుడు ఢిల్లీలో ఇంటర్ చదివాడని పక్కన పెట్టేస్తారా? అకస్మాత్తుగా తెచ్చిన నిబంధన గురించి తెలియని విద్యార్థులు వేరే రాష్ట్రంలో చదువుకోవడానికి వెళితే అక్కడా, ఇక్కడా స్థానికులు కాకుండా పోయే ప్రమాదముంది.

ఇలాంటి నిబంధనతెలియక విద్యార్థులు ఇబ్బందిపడటాన్ని మేం అంగీకరించం. ఇలాంటి విషయాల్లో విద్యార్థులను ముందే హెచ్చరించాలి. తల్లిదండ్రులకు స్తోమత ఉన్నప్పుడు పిల్లలను మంచి చదువుల కోసం దుబాయ్, లండన్, అమెరికాకు పంపొచ్చు. వారంతా ఇక్కడివారే అయినా కేవలం రెండేళ్లు బయట చదివారన్న కారణంతో ఎలా కాదంటారు? అందువల్ల కావాలనుకుంటే 2028 నుంచి స్థానికత నిబంధనను అమల్లోకి తీసుకురండి" అని జస్టిస్ గవాయ్ సూచించారు.

మొదటి పేజీ తరువాయి

# హైదరాబాద్- అమరావతి రోడ్డును విస్తరించండి

**హైదరాబాద్- విజయవాడ రహదారిని మల్కాపూర్ నుంచి అమరావతి వరకు నాలుగు లేన్ల నుంచి ఆరు వరుసలకు విస్తరించాలని కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కోరారు.**



ఈ కబురు,న్యూఢిల్లీ: హైదరాబాద్ విజయవాడ రహదారిని మల్కాపూర్ నుంచి అమరావతి వరకు నాలుగు లేన్ల నుంచి ఆరు వరుసలకు విస్తరించాలని కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కోరారు. సర్వీస్ రోడ్లు నిర్మించాలన్నారు. ఢిల్లీలో ఎంపీలు రఘురామిరెడ్డి, సురేష్ షెట్కార్, చామల కిరణ్‌కుమార్, వంశీకృష్ణ, ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి జితేందర్‌రెడ్డితో కలిసి కేంద్ర మంత్రికి కోమటిరెడ్డి వినతిపత్రం అందజేశారు. అనంతరం మీడియాకు వివరాలు వెల్లడించారు. ఎన్‌హెచ్ 65ను విస్తరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అంచనాలు పంపితే.. 15న ఆర్థిక సంఘం సమావేశంలో ఆమోదం తెలిపి, టెండర్లు ఆహ్వానిస్తామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చినట్లు తెలిపారు. సంగారెడ్డిచౌటుప్పల్ మధ్య రీజినల్ రింగ్ రోడ్డు ఉత్తర భాగం పనులతోపాటు దక్షిణ భాగం కూడా యుద్ధ ప్రాతిపదికన ప్రారంభించాలని కోరినట్లు చెప్పారు. హైదరాబాద్‌లో చింతలకుంట చెక్ పోస్ట్ నుంచి హయత్‌నగర్ ఆలిండియా రేడియో స్టేషన్ వరకు ఎలివేటెడ్ కారిడార్ నిర్మించాలని కోరామన్నారు.

**జోడువాగు రోడ్డు సమస్యను పరిష్కరించాలి**

పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలోని జోడువాగు రోడ్లు, నేషనల్ హైవే 63 ఏళ్లుగా డీపీఆర్ దశలోనే ఆగిందని, సమస్యను పరిష్కరించాలని నితిన్ గడ్కరీని మంత్రి వివేక్ కోరారు. తెలంగాణలో నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు, ఐటీఐ హబ్‌లు ఏర్పాటు చేయాలని కేంద్ర నైపుణ్యాభివృద్ధిశాఖ సహాయ మంత్రి జయంత్ చౌదరికి వివేక్ విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో ఉపాధి హామీ పనిదినాలు పెంచాలని కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ను మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క కోరారు. తెలంగాణకు ఖరీఫ్ సీజన్ కోసం 6.60 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరాలో 2.24 లక్షల మెట్రిక్ టన్నులు కొరత ఏర్పడిందని, దీనిని వెంటనే సరఫరా చేయాలని కేంద్ర ఎరువుల శాఖ మంత్రి జేపీ నడ్డాను ఎంపీ చామల కిరణ్‌కుమార్ లేఖలో కోరారు.మా తమ్ముడికి మంత్రి పదవి హామీపై నాకు తెలియదు: మంత్రి కోమటిరెడ్డితన తమ్ముడు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవిపై కాంగ్రెస్ అధిష్ఠానం హామీకి సంబంధించి తనకు సమాచారం లేదని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. సోదరుడికి మంత్రి పదవి ఇచ్చే స్థాయిలో తాను లేనని, అది తన చేతుల్లో పని కాదని అన్నారు. "మాది జాతీయ పార్టీ. అగ్రనాయకత్వం సీఎం అభిప్రాయాలు తీసుకుని.. ఆయన అనుమతితో మంత్రి పదవులపై నిర్ణయం తీసుకుంటుంది. అందులో ఎవరి ప్రమేయమూ ఉండదు. పార్టీలోకి తీసుకునేముందు మాట ఇచ్చారనే విషయం నాకు తెలియదు. వారు ఇస్తే సంతోషమే. హై కమాండ్ ఏ నిర్ణయం తీసుకున్నా సమర్థిస్తా. నేను సీఎం రేసులో లేను.. మంత్రి రేసులోనూ లేను. మంత్రి పదవి ఇచ్చారు తీసుకున్నాను" అని మంత్రి వెంకట్‌రెడ్డి అన్నారు. బీఆర్‌ఎస్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం కక్షసాధింపులకు పాల్పడుతోందన్న ఆరోపణలపై స్పందిస్తూ కక్ష సాధించేందుకు రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ ఉంటే కదా? అని ఎద్దేవా చేశారు. ఇక సినిమా టికెట్ ధరలు పెంచినట్లే సినీ కార్మికుల వేతనాలు కూడా పెంచాల్సిన అవసరం ఉందని ఒక ప్రశ్నకు సమాధానంగా మంత్రి చెప్పారు.

# 9 ఒప్పందాలపై భారత్‌ఫిలిప్పీన్స్ సంతకాలు



హైదరాబాద్, ఈ కబురు: ఢిల్లీ: భారత్ ఫిలిప్పీన్స్‌ల మైత్రి ప్రబలమై వ్యూహాత్మక సహకార స్థాయికి ఎదిగిందని ప్రధాని నరేంద్రమోదీ వెల్లడించారు. మంగళవారం ఫిలిప్పీన్స్ అధ్యక్షుడు ఫెర్డినాండ్ ఆర్ మార్కోస్ జూనియర్‌తో చర్చల అనంతరం ఆయన ఈ ప్రకటన చేశారు. "భారత్ ఫిలిప్పీన్స్‌లు మిత్రదేశాలుగా ఉండాలని నిర్ణయించాయి. ఇరుదేశాల మధ్య భాగస్వామ్యం విధి లిఖితం" అని మోదీ అన్నారు. రెండు దేశాలు వ్యూహాత్మక సహకార ఒడంబడికతో సహా మొత్తం 9 ఒప్పందాలపై సంతకాలు చేశాయి. హిందూ మహాసముద్రం నుంచి పసిఫిక్ మహాసముద్రం వరకూ ఇరు దేశాల మధ్య స్నేహం విలువల ప్రాతిపదికన పరిఢవిల్లుతోందని ఆయన అన్నారు. ప్రధాని ప్రకటన చేస్తుండగా ఫిలిప్పీన్స్ అధ్యక్షుడు ఆయన పక్కనే ఉన్నారు. ఏప్రిల్ 22న జరిగిన పహల్గాం ఉగ్రదాడిని నిర్ద్వంద్వంగా ఖండించడంతో పాటు ఉగ్రవాదంపై పోరాటంలో భారత్‌కు మద్దతు పలికినందుకు మోదీ ఫిలిప్పీన్స్ అధ్యక్షునికి మోదీ ధన్యవాదాలు తెలిపారు.

**రాష్ట్రపతి భవన్‌లో ముర్ము, మోదీ స్వాగతం**

ఫిలిప్పీన్స్ అధ్యక్షుడు ఐదురోజుల అధికారిక పర్యటన కోసం సోమవారం సతీసమేతంగా భారత్ విచ్చేశారు. తన పర్యటనలో భాగంగా ఆయన మంగళవారం రాష్ట్రపతి భవన్ సందర్శించారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆయనకు స్వాగతం పలికారు. ఫిలిప్పీన్స్‌తో భారత దౌత్య సంబంధాలకు 75 ఏళ్లు పూర్తైన నేపథ్యంలో మార్కోస్ జూనియర్ దంపతుల అధికారిక పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది.

# నేడు, రేపు భారీ వర్షాలు



రాష్ట్రంలో మరో రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. బుధ, గురువారాల్లో కొన్ని జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. ఈ మేరకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. గురువారం ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, ములుగు, సూర్యాపేట, నల్లగొండ, నాగర్‌కర్నూల్, యాదాద్రి భువనగిరి, జనగాం, పెద్దపల్లి, కరీంనగర్, మంచిర్యాల, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి, మేడ్చల్, హైదరాబాద్, రంగారెడ్డి, సిరిసిల్ల, సిద్దిపేట జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. మంగళవారం ఉదయం నుంచి బుధవారం ఉదయం మధ్య రాష్ట్రంలో ఏడు మండలాల్లో 610 సెం.మీ. మధ్య వర్షపాతం నమోదైనట్లు వెల్లడించింది. మరో 78 మండలాల్లో 26 సెం.మీ. మధ్య వర్షపాతం రికార్డు అయినట్లు వాతావరణ కేంద్రం తెలిపింది.

# అదానీ పోర్ట్స్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ బాధ్యతల నుంచి నిష్క్రమించిన గౌతమ్ అదానీ

బిలియనీర్, అదానీ గ్రూప్ అధినేత గౌతమ్ అదానీ కీలక నిర్ణయం తీసుకున్నారు. అదానీ పోర్ట్స్ అండ్ స్పెషల్ ఎకనమిక్ జోన్(సెజ్) ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ బాధ్యతల నుంచి తప్పుకున్నారు. ఈ విషయాన్ని అదానీ పోర్ట్స్ బోర్డు డైరెక్టర్లు మంగళవారం ఎక్స్చేంజ్ ఫైలింగ్‌లో తెలిపారు. గౌతమ్ అదానీ కంపెనీ కీలక నిర్వహక పాత్ర నుంచి వైదొలిగారని వెల్లడించారు. అదానీ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ వ్యవస్థాపకుడు, ఛైర్మన్‌గా ఉన్న గౌతమ్ అదానీ దేశంలోనే అతిపెద్ద పోర్ట్ నిర్వహణ సంస్థ అయిన అదానీ పోర్ట్‌స్‌కు ఇకపై నాన్-ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా వ్యవహరించనున్నారు. ఈ నిర్ణయం మంగళవారం(ఆగష్టు 5) నుంచే అమల్లోకి వస్తుందని కంపెనీ తెలిపింది. ఇదే సమయంలో మనీష్ కేజ్రీవాల్‌ను 3 సంవత్సరాల ప్రారంభ కాలానికి అదనపు నాన్-ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా నియమించింది. గౌతమ్ అదానీ ఈ బాధ్యతలను వదులుకోవడం వెనుక కారణాలు తెలియనప్పటికీ,



ఇటీవల పరిణామాల్లో ఆంక్షల ఉల్లంఘన, లంచం ఆరోపణలపై దర్యాప్తు సహా అమెరికా అధికారుల నుంచి చట్టపరమైన ఇబ్బందుల నేపథ్యంలో రోజువారీ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని ఆయన నిర్ణయించినట్లు సమాచారం. అయితే, ఈ మార్పు వల్ల అదానీ పోర్టులపై ఎలాంటి ప్రభావం ఉండకపోవచ్చు. అదానీ పోర్ట్స్ ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో 21 శాతం ఆదాయ వృద్ధిని, సరుకు రవాణాలో 11 శాతం పెరుగుదలను నమోదు చేయగలిగింది. కాగా, మంగళవారం మార్కెట్లు ముగిసే సమయానికి అదానీ పోర్ట్స్ షేర్ ధర 2 శాతం మేర క్షీణించి రూ. 1,361.90 వద్ద ఉంది.



# వివో నుంచి మరో సరికొత్త ఫోన్.. 6000mAh బ్యాటరీ, ధర ఎంతంటే

ఇండియన్ మార్కెట్లో వివో కంపెనీకి మంచి డిమాండ్ ఉన్న సంగతి తెలిసిందే. వందలో కనీసం 40 శాతం మంది ఈ మొబైల్ కంపెనీకి సంబంధించిన.. ఫోన్స్ వాడుతున్నారు. సామాన్యులు కూడా కొనుగోలు చేసేలా... వివో రకరకాల మొబైల్స్ రిలీజ్ చేస్తోంది. ఈ నేపథ్యంలోనే వివో y 400 పేరుతో మరో కొత్త ఫోన్ తీసుకువచ్చింది.

ఇందులో 6000 mah బ్యాటరీ సామర్థ్యం, అలాగే 50 ఎంపీ ప్రధాన కెమెరా కూడా ఉంటుంది. అంతేకాదు 6.67 అంగుళాల డిస్ప్లే కూడా అందిస్తున్నారు. ఆండ్రాయిడ్ 15 ఆధారిత ఫన్ టచ్ os 15 తో ఈ మొబైల్ ఫోన్ పనిచేస్తుంది. సెల్ఫీల కోసం 32 MP కెమెరా కూడా ఉంది. 90W ఫాస్ట్ ఛార్జింగ్ ఈ మొబైల్ ఫోన్ కు మాత్రమే సపోర్ట్ చేస్తుంది.

వివో వై 400 5జి మొబైల్ ఫోన్ రెండు వేరియంట్లలో లభిస్తుంది. 8gb +128gb మోడల్ మొబైల్ ధర 22,000 రూపాయలుగా ఫిక్స్ చేశారు. 8gb +256gb మోడల్ మొబైల్ ధర 24 వేల రూపాయలుగా ఫిక్స్ చేశారు. గ్లామ్ వైట్, ఆలివ్ గ్రీన్ కలర్స్‌లో మాత్రమే ఈ ఫోన్స్ లభిస్తాయి. ఈ నెల ఏడో తేదీ నుంచి ఈ మొబైల్ ఫోన్స్ రిటైల్ షాపులలో కూడా కొనుగోలు చేయవచ్చు.







## జేఎల్ఆర్ తొలి భారత సీఈవోగా పీబీ బాలాజీ

టాటా గ్రూప్‌లో భాగమైన బ్రిటిష్ ఆటోమొబైల్ సంస్థ జాగ్వార్ లాండ్ రోవర్ (జేఎల్ఆర్) తొలి భారత సీఈవోగా పీబీ బాలాజీ సేవలు అందించనున్నారు. ఆగస్ట్ 4నాటి సమావేశంలో పీబీ బాలాజీ నియామకానికి అనుకూలంగా నిర్ణయం తీసుకున్నట్లు కంపెనీ ప్రకటించింది.

ప్రస్తుతం బాలాజీ టాటా గ్రూప్ సీఎఫ్‌వోగా పనిచేస్తున్నారు. జేఎల్ఆర్ సీఈవోగా ఇటీవలే మూడేళ్ల పదవీ కాలాన్ని పూర్తి చేసుకున్న ఆర్డియన్ మార్డెల్ తప్పుకోవాలని నిర్ణయించుకోవడం గమనార్హం. జేఎల్ఆర్‌తో ఆయన 35 ఏళ్లుగా కలసి నడుస్తున్నారు. జేఎల్ఆర్ సీఈవో బాధ్యతలను బాలాజీ నవంబర్‌లో చేపడతారని కంపెనీ వెల్లడించింది.



# నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

మంగళవారం ఉదయం నష్టాల్లో ప్రారంభమైన దేశీయ స్టాక్ మార్కెట్లు.. ట్రేడింగ్ క్లోజ్ అయ్యే సమయానికి నష్టాల్లోనే ముగిశాయి. సెన్సెక్స్ 308.47 పాయింట్లు లేదా 0.38 శాతం నష్టంతో.. 80,710.25 వద్ద, నిఫ్టీ 73.20 పాయింట్లు లేదా 0.30 శాతం నష్టంతో 24,649.55 వద్ద నిలిచాయి.

ఆదిత్య ఇన్ఫోటెక్ లిమిటెడ్, న్యూజెన్ సాఫ్ట్‌వేర్ టెక్నాలజీస్, ప్రకాష్ ఇండస్ట్రీస్, ఎక్స్‌టిగ్లోబల్ ఇన్ఫోటెక్, తాన్లా ప్లాట్‌ఫారమ్ వంటి కంపెనీలు టాప్ గెయినర్స్ జాబితాలో చేరగా.. లక్ష్మి ఇండియా ఫైనాన్స్ లిమిటెడ్, త్రివేణి టర్బైన్, గోకల్దాస్ ఎక్స్‌పోర్ట్స్, శీతల్ కూల్ ప్రొడక్ట్స్, నెట్‌వర్క్ పీపుల్ సర్వీసెస్ టెక్నాలజీస్ లిమిటెడ్ వంటి సంస్థలు నష్టాలను చవిచూశాయి.






# ఆన్‌లైన్ మోసాలపై హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ కీలక హెచ్చరిక

సైబర్ మోసాల పట్ల ప్రైవేట్ రంగ దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మంగళవారం కీలక హెచ్చరిక జారీ చేసింది. ముఖ్యంగా తమ బ్యాంకు కస్టమర్లు ఏపీకే(ఆండ్రాయిడ్ ప్యాకేజీ కిట్) మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ఏపీకే స్కామ్‌లో సైబర్ మోసగాళ్లు సాధారణంగా బ్యాంక్ ఉద్యోగులు లేదా ప్రభుత్వ అధికారుల పేర్లతో నటించి సోషల్ ఇంజనీరింగ్ వ్యూహాలను ఉపయోగిస్తున్నారు. కస్టమర్లతో మాట్లాడిన తర్వాత ఏపీకే ఫైల్స్ పంపి తమ స్మార్ట్‌ఫోన్‌లలో ఇన్‌స్టాల్ చేయమని కోరుతున్నారు. అనంతరం కస్టమర్ల స్మార్ట్‌ఫోన్‌లను తమ కంట్రోల్‌లోకి తీసుకుంటున్నారని, బ్యాంకు ఖాతాల్లో ఉండే సొమ్మును కాజేస్తున్నట్లు బ్యాంకు తెలిపింది. ఏవైనా మెసేజ్‌ల రూపంలో తమ ఫోన్‌కు ఏపీకే ఫైల్స్ వస్తే, అటువంటి వాటిని డౌన్‌లోడ్ చేయడం, ఉపయోగించడం లాంటిది చేయొద్దని స్పష్టం చేసింది. కస్టమర్లు థర్డ్ పార్టీ యాప్స్‌ను అస్సలు వాడొద్దని, ఏవైనా లింక్‌లు వస్తే అవి విశ్వసనీయమైనవేనా కాదా తనిఖీ చేసుకోవాలని పేర్కొంది. సైబర్ మోసగాళ్లు ఏపీకే ఫైల్‌స్‌ను స్మార్ట్‌ఫోన్‌లకు పంపి, వాటిని ఇన్‌స్టాల్ చేసేలా ప్రేరేపిస్తారు. ఆ త్రార్వాత సదరు ఫోన్‌లపై పూర్తి నియంత్రణ తీసుకుని కాల్స్, మెసేజ్‌లను మరొక డివైజ్‌కు షేర్ చేసుకుంటారు. ఆ తర్వాత కస్టమర్ ఫోన్‌లో ఉండే మొత్తం డేటాను దొంగిలిస్తారు. బ్యాంక్ ఖాతా యాక్సెస్ చేయవచ్చు, లావాదేవీలు నిర్వహించవచ్చని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ హెచ్చరించింది.

# వాహనదారులకు శుభవార్త.. ఈ కార్లపై రూ.2.30 లక్షల డిస్కౌంట్..!




మార్కెట్లోకి అనేక రకాల వాహనాలు వస్తున్న సంగతి తెలిసిందే. సామాన్యులు కూడా కొనుగోలు చేసేలా.. కార్లు వస్తున్నాయి. అయితే అలాంటి వాటిలో మోటార్ ఒకటి. ఈ కంపెనీ ఇండియాలోకి వచ్చి ఆరు సంవత్సరాలు పూర్తయింది. ఈ నేపథ్యంలోనే కంపెనీ నుంచి అదిరిపోయే ఆఫర్ కూడా వచ్చేసింది. ఈ కంపెనీకి సంబంధించిన ఒక్కో వేరియంట్ పై... రకరకాల డిస్కౌంట్లు కొనసాగుతున్నాయి.

2.30 లక్షల వరకు రాయితీలు ఇస్తోంది కంపెనీ. ముఖ్యంగా... షార్ప్ ప్రో 1.5 పెట్రోల్ ఎంఎన్టి మోడల్ కారుపై అత్యధికంగా 2.14 లక్షల వరకు డిస్కౌంట్ ఉంది. అంటే ఈ కారు ప్రస్తుతం 19 లక్షల కి లభిస్తుందన్నమాట. స్నో స్మార్ట్, బ్లాక్ స్మార్ట్ మోడల్ కార్లపై కూడా డిస్కౌంట్ ఉంది. హెక్టర్ ప్లస్ విషయానికి వస్తే... ఇందులో షార్ప్ ప్రో 1.5 పెట్రోల్ ఎమ్ ఎన్ టి మోడల్ పై రూ.2.30 లక్షల వరకు డిస్కౌంట్ అందిస్తున్నారు.

హెక్టార్ ప్లస్ సెవెన్ సీటర్ మోడల్ లో షార్ప్ 1.5 పెట్రోల్ వేరియంట్ పైన కూడా రూ.2.30 లక్షల డిస్కౌంట్ ఉంది. సెలెక్ట్ ప్రో, షార్ప్ ప్రో, సావి ప్రో లాంటి ట్రీమ్స్ పైన కూడా రెండు లక్షల వరకు డిస్కౌంట్ అందిస్తున్నారు. అయితే బేస్ వేరియంట్ స్టైల్ ట్రిమ్ ధర మాత్రం 25 వేల రూపాయలు పెంచారు.

# ప్రస్తుతం టాలీవుడ్ ఇండస్ట్రీ పరిస్థితి బాగాలేదు: నిర్మాత రాజ్ కందుకూరి



సినీ కార్మికుల ఆందోళనలపై నిర్మాత రాజ్ కందుకూరి కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం టాలీవుడ్ ఇండస్ట్రీ పరిస్థితి బాగాలేదని అన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో సినీ కార్మికులు జీతాలు పెంచాలని ఆందోళన చేయడం విచారకరం అన్నారు. ఫైనాన్షియల్ గా చిత్ర పరిశ్రమ ఇబ్బందుల్లో ఉందని చెప్పారు. ఏడాదికి 200 సినిమాల వరకు రిలీజ్ అయితే అందులో 20, 30 సినిమాలు కూడా హిట్ అవ్వడం లేదని అన్నారు. ప్రతి నిర్మాత ఏదో ఒక రకంగా నష్టపోతున్నారని తెలిపారు. ప్రొడక్షన్ వ్యయం పెరిగిందని, రెమ్యునరేషన్లు పెరిగాయని అన్నారు.

అన్ని ధరలు పెరిగాయని కానీ ఇలాంటి సమయంలో ఎలాంటి నిర్ణయం తీసుకోవద్దని ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ నుంచి ఆదేశాలు వచ్చాయన్నారు. నిర్మాతల సంఘం ఏం చెబితే అదే ఫైనల్ అని దానికి తాము కట్టుబడి ఉండాలన్నారు. సినీ పరిశ్రమ కష్టాలకు ఏదైనా పరిష్కారం దొరికితే అందరికీ మంచి జరుగుతుందన్నారు. కార్మికుల కష్టాలను అర్థం చేసుకుంటామని, వాళ్లు కూడా పరిశ్రమ పరిస్థితిని అర్థం చేసుకుని సహకరించాలన్నారు. షూటింగ్ ఆగిపోవడం పరిశ్రమకు అంత మంచిది కాదన్నారు. త్వరలోనే ఈ సమస్యలన్నీ తొలగిపోయి మళ్లీ మంచి రోజులు రావాలని కోరుకున్నారు.

# యాక్షన్ థ్రిల్లర్‌తో టాలీవుడ్ ఎంట్రీ ఇవ్వబోతున్న హాట్ బ్యూటీ.. లక్కీ చాన్స్ కొట్టేసిందిగా!



బాలీవుడ్ యంగ్ బ్యూటీ జాక్వెలిన్ ఫెర్నాండేజ్ఇటీవల 'హౌస్‌ఫుల్-5' సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్ అందుకుంది. ప్రస్తుతం వరుస ప్రాజెక్ట్స్‌లో అవకాశాలు అందుకుంటూ ఫుల్ ఫామ్‌లో ఉంది. అలాగే స్పెషల్ సాంగ్స్ కూడా చేస్తూ జనాలను ఎంటర్‌టైన్ చేస్తుంది. తాజాగా, జాక్వెలిన్ టాలీవుడ్ ఇండస్ట్రీకి ఎంట్రీ ఇవ్వబోతున్నట్లు పలు పోస్టులు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

గతంలో ప్రభాస్ 'సాహో' మూవీ స్పెషల్ సాంగ్‌లో ఆడిపాడిన ఈ భామ ఇప్పుడు ఓ లేడీ ఓరియెంటెడ్ చిత్రంతో రాబోతున్నట్లు సమాచారం. 'పేపర్ బాయ్' సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్న వి. జయశంకర్ దర్శకత్వంలో ఈ మూవీ తెరకెక్కుతుండగా.. యాక్షన్, సస్పెన్స్‌తో కూడిన ఒక ఇంటెన్స్ స్క్రిప్ట్‌ను జయశంకర్ రెడీ చేశాడు. ఈ స్టోరీ జాక్వెలిన్‌ను చెప్పడంతో కథ నచ్చడంతో అమ్మడు నటించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు టాక్. ఇందులో యాక్షన్స్ సీన్స్‌లో పవర్ ఫుల్ లేడీగా జాక్వెలిన్ కనిపించనుంది.

ప్రస్తుతం స్క్రిప్ట్ ఫైనల్ చేసే ప్లాన్‌లో దర్శకుడు ఉండగా.. ఈ సినిమా కోసం జాక్వెలిన్ ఉత్సాహంగా ఉందని సమాచారం. ముఖ్యంగా దీని మేకోవర్‌కు పూర్తి శారీరక పరివర్తన అవసరం కాబట్టి. ఈ పాత్రను పోషించడానికి ఆమె పలు సన్నాహాలు కూడా ప్రారంభించిందట. ఈ ప్రాజెక్ట్ త్వరలో సెట్స్ పైకి వెళ్లనున్నట్లు తెలుస్తోంది. ఇక ఈ సినిమా తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ, హిందీ భాషల్లో విడుదల కాబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇందులో నిజమెంత అనేది తెలియనప్పటికీ ఇందుకు సంబంధించిన పోస్టులు మాత్రం ప్రేక్షకుల్లో అంచనాలను పెంచుతున్నాయి.కొందరు లక్కీ గర్ల్ అని కామెంట్లు

# సైన్స్ ఫిక్షన్ సినిమాలో అనన్య.. డైరెక్టర్ ఎవరంటే?



'లైగర్' చిత్రంతో టాలీవుడ్ ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చింది అనన్య పాండే. ఫస్ట్ మూవీనే డిజాస్టర్ కావడంతో తెలుగులో మరో చిత్రం అనౌన్స్ చేయని ఈ హీరోయిన్ ప్రస్తుతం బాలీవుడ్‌లో మాత్రం వరుస సినిమాలు చేస్తూ సందడి చేస్తుంది.


ఈ ఏడాది 'కేసరి అధ్యాయం 2'తో అలరించిన ఈమె.. ప్రజెంట్ 'తు మేరీ మెయిన్ తేరా మెయిన్ తేరా తు మేరీ', 'చాంద్ మేరా దిల్' వంటి సినిమాల్లో నటిస్తుంది. ఇదిలా ఉంటే.. ఇప్పుడు ఈ బ్యూటీ మరో సినిమాకు సిద్ధం అయినట్లు తెలుస్తోంది. బాలీవుడ్ ప్రముఖ నిర్మాత దినేష్ విజయ్ ఒక సైన్స్ ఫిక్షన్ కామెడీ చిత్రాన్ని ప్లాన్ చేస్తున్నాడట.

'చూమంతర్' అనే టైటిల్‌తో తెరకెక్కబోతున్న ఈ మూవీలో 'ముంజ్య' బ్రేక్‌అవుట్ అభయ్ వర్మ ప్రధాన పాత్రల్లో నటిస్తుండగా.. అనన్య పాండేను ఫీమేల్ లీడ్‌లో ఫిక్స్ చేసినట్లు తెలుస్తుంది. సైన్స్ ఫిక్షన్ అండ్ రొమాన్స్, కామెడీలను మిళితం చేస్తూ 'ధక్ ధక్' హెల్మర్ తరుణ్ దుడేజా ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తారు.

అయితే.. ఈ సినిమాను ఇంకా అఫీషియల్‌గా అనౌన్స్ చేయనప్పటికీ.. సెప్టెంబర్‌లో సన్నాహాలు ప్రారంభమవుతాయి, చిత్రీకరణ ఈ సంవత్సరం చివరి నాటికి ప్రారంభమయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది.

# 'ఓలే ఓలే' పాట వచ్చేసింది..

## మాస్ స్టెప్పులతో ఆకట్టుకున్న రవితేజ, శ్రీలీల




మాస్ మహారాజా రవితేజ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'మాస్ జాతర'. భాను భోగవరపు దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో శ్రీలీల హీరోయిన్. కర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్ ప్రేక్షకులను మెప్పించి.. సినిమాపై భారీ అంచనాలు ఏర్పడేలా చేసింది. మొదటి గీతంగా విడుదలైన 'తు మేరా లవర్' అందరినీ ఉర్రూతలూగించింది. ఇప్పుడు రెండవ గీతంగా 'ఓలే ఓలే'ను విడుదల చేసింది చిత్ర బృందం. అందరూ కాలు కదిపేలా ఎంతో ఉత్సాహభరితంగా ఈ గీతముంది.

ధమాకా జోడి రవితేజ-శ్రీలీల తెరపై కనిపిస్తే ఆ సందడే వేరు. 'ఓలే ఓలే' పాటతో ఈ జోడి మరోసారి ఆకట్టుకుంది. ఇద్దరూ పోటాపోటీగా నర్తించి పాటను మరో స్థాయికి తీసుకెళ్ళారు. రవితేజ తన వింటేజ్ స్టెప్పులతో అలరించారు. శ్రీలీల తన అసాధారణ నృత్య ప్రతిభతో మరోసారి కట్టిపడేశారు. ఇద్దరూ కలిసి ఇంతకు ముందు ఎన్నడూ లేని విధంగా తెరపై మెరుపులు మెరిపిస్తున్నారు.




# అనుపమ పరదా మూవీ.. బ్యూటీఫుల్ సాంగ్ వచ్చేసింది!

అనుపమ పరమేశ్వరన్ ప్రధాన పాత్రలో వస్తోన్న తాజా చిత్రం పరదా. ఈ చిత్రానికి సినిమా బండి ఫేమ్ ప్రవీణ్ కండ్రేగుల దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం విడుదలకు సిద్ధమైంది. ఈ నేపథ్యంలోనే పరదా మూవీ నుంచి మరో అప్‌డేట్ ఇచ్చారు మేకర్స్. ఇప్పటికే యత్ర నార్యస్తు పూజ్యంతే అనే పాటను విడుదల చేయగా ఆడియన్స్ నుంచి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. తాజాగా మరో లిరికల్ సాంగ్‌ను రిలీజ్ చేశారు. ఎగరేయి నీ రెక్కలే అంటూ సాగే బ్యూటీఫుల్ సాంగ్‌ను విడుదల చేశారు. ఈపాటకు వనమాలి లిరిక్స్ అందించగా.. రితేశ్ జీ రావు ఆలపించారు. ఈ సాంగ్‌ను గోపి సుందర్ అద్భుతంగా కంపోజ్ చేశారు. కాగా.. ఈ చిత్రంలో సంగీత, దర్శనా రాజేంద్రన్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ మూవీని విజయ్ డొంకాడ, శ్రీనివాసులు పీవీ, శ్రీధర్ మక్కువ నిర్మిస్తున్నారు. ఆగష్టు 22న ఈ చిత్రం విడుదల థియేటర్లో సందడి చేయనుంది.

# అనుష్క శెట్టి 'ఘాటి'.. ట్రైలర్ రిలీజ్ డేట్ ఫిక్స్




అనుష్క శెట్టి లీడ్ రోల్‌లో నటిస్తోన్న తాజా చిత్రం ఘాటి. ఈ సినిమాలో విక్రమ్ ప్రభు మరో కీలక పాత్రలో నటించారు. జాగర్ల మూడి రాధాకృష్ణ (క్రిష్) దర్శకత్వంలో తెరకెక్కిస్తున్నారు. ఈ మూవీని యూవీ క్రియేషన్స్ సమర్పణలో రాజీవ్ రెడ్డి, సాయిబాబు జాగర్లమూడి నిర్మించారు. ఇప్పటికే రిలీజ్ కావాల్సిన ఈ సినిమా వాయిదా పడింది.
తాజాగా ఈ మూవీకి సంబంధించిన బిగ్ అప్‌డేట్ వచ్చేసింది. ఘాటి ట్రైలర్ రిలీజ్ డేట్‌ను మేకర్స్ రివీల్ చేశారు. ఆగస్టు 6న ట్రైలర్ విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. అదే రోజు మూవీ విడుదల తేదీని కూడా అనౌన్స్ చేయనున్నారు. ఈ మేరకు ఘాటి మూవీ పోస్టర్‌ను పంచుకున్నారు. ఈ చిత్రాన్ని తెలుగు, తమిళ, హిందీ, మలయాళం భాషల్లో పాన్ ఇండియా స్థాయిలో రిలీజ్ చేయనున్నారు. ఈ సినిమాకు నాగవెల్లి విద్యాసాగర్ సంగీతమందిస్తున్నారు.

# అరంగేట్రంలో తిలక్ వర్మ అట్టర్ ప్లాప్..




టీమిండియా జెర్సీలో తిలక్ వర్మ(ఫైల్ ఫోటో)

టీమిండియా యువ ఆటగాడు తిలక్ వర్మ ఇంగ్లండ్ డొమాస్టిక్ వన్డే కప్ అరంగేట్రంలో తీవ్ర నిరాశపరిచాడు. మంగళవారం వేల్స్ క్రికెట్ గ్రౌండ్ వేదికగా గ్లామోర్గాన్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో హాంప్‌షైర్ తరపున బరిలోకి దిగిన తిలక్.. డకౌట్‌గా వెనుదిరిగాడు.

మూడో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన తిలక్ కేవలం మూడు బంతులు మాత్రమే ఆడి ఖాతా తెరవకుండానే పెవిలియన్‌కు చేరాడు. పేసర్ నెడ్ లియోనార్డ్ బౌలింగ్‌లో అస ట్రైబ్‌కు క్యాచ్ ఇచ్చి ఈ హైదరాబాదీ ఔటయ్యాడు. అయితే అంతకుముందు కౌంటీ ఛాంపియన్‌షిప్‌లో తిలక్ అదరగొట్టాడు. 4 మ్యాచ్‌లలో హాంప్‌షైర్ తరపున తిలక్ 358 పరుగులు చేశాడు. అందులో రెండు సెంచరీలు ఉన్నాయి.ఇక ఈ మ్యాచ్ విషయానికి వస్తే.. టాస్ గెలిచిన గ్లామోర్గాన్ కెప్టెన్ కిరణ్ కార్ల్సన్ ముందుగా బౌలింగ్ చేయాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో తొలుత బ్యాటింగ్‌కు దిగిన హాంప్‌షైర్ నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 324 పరుగుల భారీ స్కోర్ సాధించింది.

హాంప్‌షైర్ కెప్టెన్ గుబ్బిన్స్(144) భారీ సెంచరీతో మెరిశాడు. అతడితో పాటు బెన్ మేయస్(74), ఓర్(45) రాణించారు. గ్లామోర్గాన్ బౌలర్లలో నెడ్ లియోనార్డ్ మూడు వికెట్లు పడగొట్టాడు. అనంతరం లక్ష్య చేధనలో గ్లామోర్గాన్ 28 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 175 పరుగులు చేసింది.



# హర్మన్‌ప్రీత్ సారథ్యంలో...

**న్యూఢిల్లీ:** ఆసియా కప్ టోర్నమెంట్‌కు సన్నాహాల్లో భాగంగా భారత పురుషుల హాకీ జట్టు ఈ నెలలో ఆస్ట్రేలియాలో పర్యటించనుంది. ఆగస్టు 15 నుంచి 21 వరకు జరిగే ఈ పర్యటనలో టీమిండియా నాలుగు మ్యాచ్‌లు ఆడుతుంది. ఈ సిరీస్‌లో పాల్గొనే భారత జట్టును సోమవారం ప్రకటించారు. 24 మంది సభ్యులతో కూడిన భారత జట్టుకు హర్మన్‌ప్రీత్ సింగ్ సారథ్యం వహిస్తాడు. కర్ణాటకకు చెందిన డిఫెండర్ సీబీ పూవణ్ణ తొలిసారి జాతీయ సీనియర్ జట్టులోకి ఎంపికయ్యాడు. ప్రస్తుతం బెంగళూరులోని భారత స్పోర్ట్స్ అథారిటీ (సాయ్) కేంద్రంలో భారత జట్టుకు శిక్షణ శిబిరం జరుగుతోంది. ఈ పర్యటన కోసం భారత జట్టు శుక్రవారం బెంగళూరు నుంచి ఆస్ట్రేలియాకు బయలుదేరుతుంది.

భారత పురుషుల హాకీ జట్టు: కృషన్ పాఠక్, సూరజ్ (గోల్‌కీపర్లు), సుమిత్, జర్మన్‌ప్రీత్ సింగ్, హర్మన్‌ప్రీత్ సింగ్ (కెప్టెన్), సంజయ్, అమిత్ రోహిదాస్, నీలం సంజీప్, జుగ్‌రాజ్ సింగ్, పూవణ్ణ (డిఫెండర్లు), రాజిందర్ సింగ్, రాజ్‌కుమార్ పాల్, హార్దిక్ సింగ్, మన్‌ప్రీత్ సింగ్, వివేక్ సాగర్ ప్రసాద్, రబిచంద్ర సింగ్, విష్ణుకాంత్ సింగ్ (మిడ్‌ఫీల్డర్లు), మన్‌దీప్ సింగ్, శిలానంద్ లాక్రా, అభిక్, సుఖ్‌జీత్ సింగ్, దిల్‌ప్రీత్ సింగ్, సెల్వం కార్తీ, ఆదిత్య లలాగే (ఫార్వర్డ్స్).

# భారత స్టార్ ఆటగాళ్లకు షాక్..

## ఇక ఆ విధానానికి స్వస్తి పలకాలనుకుంటున్న బీసీసీఐ!

**ముంబయి:** ప్రస్తుతం టీమ్ఇండియా లోని స్టార్ క్రికెటర్లు వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా కొన్ని సిరీస్‌లకు దూరంగా ఉంటున్నారు. మరికొంతమంది సిరీస్‌ల్లో పాల్గొంటూనే కొన్ని మ్యాచ్‌ల్లో ఆడట్లేదు. ఈ ప్రభావం జట్టు ప్రదర్శనపై పడుతోంది. ఈ నేపథ్యంలో బీసీసీఐ కీలక నిర్ణయం తీసుకోబోతున్నట్లు సమాచారం. వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్ సాకుతో ఆటగాళ్లు మ్యాచ్‌లు, సిరీస్‌లను ఎంచుకునే విధానానికి స్వస్తి పలకాలని భావిస్తోందట. ఈ విషయంలో సెలక్షన్ కమిటీ, ప్రధాన కోచ్ గంభీర్, బీసీసీఐ పెద్దలు ఏకాభిప్రాయంతో ఉన్నారని సమాచారం.

‘ఈ విషయంపై చర్చలు జరిగాయి. సెంట్రల్ కాంట్రాక్ట్ కుదుర్చుకున్న ఆటగాళ్లకు, ముఖ్యంగా అన్ని ఫార్మాట్లలో ఆడే రెగ్యులర్ ఆటగాళ్లందరికీ మ్యాచ్‌లను ఎంచుకునే సంస్కృతి సమీప భవిష్యత్తులో ఉండదని సందేశం పంపాలనుకుంటున్నారు. అలా అని పూర్తిగా పనిభార నిర్వహణను పక్కన పెట్టేస్తారని కాదు. కానీ, సమీప భవిష్యత్తులో మరింత నిష్పాక్షికమైన విధానాన్ని అమలు చేయాలని ఆశిస్తున్నారు. అయితే, ఫాస్ట్ బౌలర్ల విషయంలో కచ్చితంగా వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్ అవసరమే. కానీ, పనిభార నిర్వహణ సాకుతో కీలక మ్యాచ్‌లకు దూరంగా ఉంటామంటే అందుకు అంగీకరించేది లేదు’ అని పేరు వెల్లడించడానికి ఇష్టపడని సీనియర్ బీసీసీఐ అధికారి ఒకరు పీటీఐతో అన్నారు.

ఇంగ్లాండ్‌తో ఐదు టెస్టుల సిరీస్‌లో స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా మూడు మ్యాచ్‌లే ఆడాడు. మరో పేసర్ సిరాజ్ మాత్రం ఐదు టెస్టుల్లో ఆడి ఏకంగా 185.3 ఓవర్లు బౌలింగ్ చేశాడు. సిరీస్‌లో ఎక్కువ ఓవర్లు వేసింది సిరాజే. ఈ క్రమంలోనే హైదరాబాదీ పేసర్‌ను క్రికెట్ దిగ్గజం సునీల్ గావస్కర్ ప్రశంసించాడు. కెప్టెన్ ఎప్పుడు బంతి ఇచ్చినా కాదనకుండా బౌలింగ్ చేశాడని, ఆటపై సిరాజ్ నిబద్ధత అద్భుతమని కొనియాడాడు. వర్క్‌లోడ్ అనే పదాన్ని భారత క్రికెట్ డిక్షనరీ నుంచి తొలగించాలని వ్యాఖ్యానించాడు.



# ఓవల్‌లో సిరాజ్ పోరాటం.. కపిల్ దేవ్‌ను గుర్తుకు తెచ్చింది: యోగ్‌రాజ్ సింగ్

ఇంగ్లాండ్, టీమ్ఇండియా సిరీస్‌లో భాగంగా ఓవల్‌లో ఆఖరి టెస్ట్ జరిగింది. ఈ అయిదో మ్యాచ్‌లో మహమ్మద్ సిరాజ్ అద్భుతమైన ప్రదర్శన చేశాడు. అయిదు వికెట్లు తన ఖాతాలో వేసుకుని టీమ్ఇండియాకు చిరస్మరణీయమైన విజయాన్ని అందించాడు. ఈ నేపథ్యంలో సిరాజ్‌ను టీమ్ఇండియా మాజీ క్రికెటర్ యోగ్‌రాజ్ సింగ్ ప్రశంసించాడు. సిరాజ్ పోరాటం తనకు కపిల్ దేవ్‌ను గుర్తుకు తెచ్చిందన్నాడు.

‘మన క్రికెటర్లు అద్భుతంగా ఆడారు. ముఖ్యంగా మహమ్మద్ సిరాజ్ బౌలింగ్ వేసిన విధానం ఆకట్టుకుంది. నాకు కపిల్ దేవ్ గుర్తుకు వచ్చాడు. కెప్టెన్‌గా శుభ్‌మన్ గిల్ పరిణితి సాధించాడు. సారథిగా అతడికిదే మొదటి సిరీస్ అని ఎక్కడా అనిపించలేదు’ అని యోగ్‌రాజ్ సింగ్ కొనియాడాడు.

ఈ సిరీస్‌లో మహమ్మద్ సిరాజ్ అందరి కన్నా అత్యధికంగా 185.3 ఓవర్లు బౌలింగ్ వేశాడు. అలాగే 23 వికెట్లతో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గానూ నిలిచాడు. రెండు సార్లు అయిదు వికెట్ల ప్రదర్శన సైతం చేశాడు. బ్యాటింగ్‌లో శుభ్‌మన్ గిల్ అద్భుతంగా రాణించాడు. 754 పరుగులతో ఈ సిరీస్‌లో టాప్ స్కోరర్‌గా నిలిచాడు.


# ప్రపంచ చాంపియన్ షిప్ పోటీలకు అమన్, అంతిమ్

**లక్నో:** గత ఏడాది పారిస్ ఒలింపిక్స్‌లో కాంస్య పతకం సాధించిన భారత స్టార్ రెజ్లర్ అమన్ సెహ్రావత్... ప్రపంచ చాంపియన్‌షిప్‌లో తొలి పతకంపై గురి పెట్టాడు. సెప్టెంబర్ 13 నుంచి 21వ తేదీ వరకు క్రొయేషియా రాజధాని జాగ్రెబ్‌లో ప్రపంచ సీనియర్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్ జరగనుంది. ఈ మెగా ఈవెంట్‌లో పాల్గొనే భారత పురుషుల, మహిళల ఫ్రీస్టయిల్ జట్లను సోమవారం ప్రకటించారు. రెండు రోజులపాటు నిర్వహించిన సెలెక్షన్ ట్రయల్స్ ఆధారంగా జట్లను ఎంపిక చేశారు. 22 ఏళ్ల అమన్ జూన్‌లో మంగోలియాలో జరిగిన ర్యాంకింగ్ సిరీస్ టోర్నీలో కాంస్య పతకం గెలిచాడు. రెండు నెలల తర్వాత మళ్లీ మ్యాట్‌పైకి అడుగు పెట్టిన అమన్ చురుకైన కదలికలతో ఆకట్టుకున్నాడు. ట్రయల్స్‌లో తన ప్రత్యర్థులు సుమీత్, రాహుల్‌లపై అమన్ ‘టెక్నికల్ సుపీరియారిటీ’ పద్ధతిలో (ప్రత్యర్థిపై 10 పాయింట్ల ఆధిక్యం సంపాదించడం) అలవోకగా గెలిచాడు.

‘నా అత్యుత్తమ స్థాయికి చేరుకున్నానని భావిస్తున్నాను. పూర్తి ఫిట్‌నెస్‌తో ఉన్నా. ప్రపంచ చాంపియన్‌షిప్ పోటీలకు సిద్ధంగా ఉన్నా. ఏడాది తర్వాత బరిలోకి దిగిన మంగోలియా టోర్నీలో నేను కొన్ని పొరపాట్లు చేశాను. ఓవరాల్‌గా నా ప్రదర్శనపట్ల సంతృప్తిగా ఉన్నా’ అని అమన్ వ్యాఖ్యానించాడు. 2022 ఆసియా క్రీడల్లో కాంస్యం, 2023 ఆసియా చాంపియన్‌షిప్‌లో స్వర్ణం నెగ్గిన అమన్ ప్రపంచ చాంపియన్‌షిప్‌లో మాత్రం ఇంకా పతకాల బోణీ కొట్టలేదు. మరోవైపు మహిళల విభాగంలో స్టార్ రెజ్లర్ అంతిమ్ పంఘాల్ ఈసారి ప్రపంచ చాంపియన్‌షిప్‌లో స్వర్ణమే లక్ష్యంగా బరిలోకి దిగనుంది. 2023 ప్రపంచ చాంపియన్‌షిప్‌లో కాంస్యం గెలిచిన అంతిమ్ జాతీయ ట్రయల్స్‌లో తన ప్రత్యర్థులకు ఒక్క పాయింట్ కూడా ఇవ్వకుండా విజేతగా నిలిచింది. గత ఏడాది పారిస్ ఒలింపిక్స్‌లో తొలి రౌండ్‌లోనే నిష్క్రమించిన 20 ఏళ్ల అంతిమ్ ఇప్పటికే ఆసియా క్రీడల్లో, ఆసియా చాంపియన్‌షిప్‌లో, గ్రాండ్‌ప్రి సిరీస్ టోర్నీల్లో, అండర్-20, అండర్-17 ప్రపంచ చాంపియన్‌షిప్‌లలో పతకాలు సాధించింది.

**భారత పురుషుల ఫ్రీస్టయిల్ జట్టు:** అమన్ సెహ్రావత్ (57 కేజీలు), ఉదిత్ (61 కేజీలు), సుజీత్ కల్కాల్ (65 కేజీలు), రోహిత్ (70 కేజీలు), జైదీప్ (74 కేజీలు), అమిత్ (79 కేజీలు), ముకుల్ దహియా (86 కేజీలు), దీపక్ పూనియా (92 కేజీలు), విక్కీ (97 కేజీలు), రజత్ (125 కేజీలు).

భారత మహిళల ఫ్రీస్టయిల్ జట్టు: అంకుశ్ (50 కేజీలు), అంతిమ్ (53 కేజీలు), నిశు (55 కేజీలు), తపస్య (57 కేజీలు), నేహా (59 కేజీలు), మనీషా (62 కేజీలు), వైష్ణవి (65 కేజీలు), సృష్టి (68 కేజీలు), జ్యోతి (72 కేజీలు), ప్రియా మలిక్ (76 కేజీలు).







# ఆ ప్లాన్ వర్కౌట్ కానందుకే సిరాజ్ అసహనం: గిల్



ఓవల్ టెస్టులో ఓవైపు క్రిస్ వోక్స్ చేతికి కట్టుతో వచ్చాడు. అతడిని అడ్డుపెట్టుకుని మరోవైపు గస్ అట్కిన్సన్ దూకుడుగా ఆడేందుకు ప్రయత్నించాడు. పక్కాగా ప్లాన్ చేసి బంతి వేస్తే రనౌట్ చేయడంలో నిర్లక్ష్యం వహించిన ఈ క్రమంలో వికెట్ కీపర్ ధ్రువ్ జురెల్‌పై సిరాజ్ కాస్త అసహనం వ్యక్తం చేశాడు. అయితే, మళ్లీ అట్కిన్సన్‌ను సిరాజే క్లీన్ బౌల్డ్ చేసి జట్టును గెలిపించాడు. ఈ మొత్తం ఎపిసోడ్‌పై ప్రెస్ కాన్ఫరెన్స్‌లో గిల్ వివరించాడు. ‘‘వైడ్ యార్కర్‌గా వేయాలని ముందే ప్రణాళిక సిద్ధం చేసుకున్నాం. వోక్స్‌కు స్ట్రైక్ ఇవ్వకుండా అట్కిన్సన్ ఆడతాడని తెలుసు. చివరి బంతికి సింగిల్ రాకుండా ఉంటే.. వోక్స్ స్ట్రైక్‌కు వస్తాడు. చివరి బంతికి సిక్స్ కొట్టేందుకు ప్రయత్నించడని తెలుసు. అలా జరిగితే వికెట్ లేదా రనౌట్ అయ్యే అవకాశం ఉంటుంది. అందుకే, అలా ప్లాన్ చేశాం. వికెట్ కీపర్ ధ్రువ్‌తో గ్లౌవ్స్ తీసేయించి రెడీగా ఉంచమని సిరాజ్ అప్పటికే నాతో చెప్పాడు. అయితే, నేను ధ్రువ్ వద్దకు వెళ్లి చెప్పే సమయానికి సిరాజ్ బంతిని వేయడం ప్రారంభించాడు. దీంతో రనౌట్ చేసే అవకాశం చేజారింది. అప్పుడు నాతో ధ్రువ్‌కి ఎందుకు చెప్పలేదని అడిగాడు. అక్కడ జరిగిందదే. నేను ముందే చెప్పినట్లు సిరాజ్‌పై నమ్మకం ఉంది. అతడినే నమ్మాం. ఈ మ్యాచ్‌లో అతడి కృషి అద్భుతం. క్యాచ్ చేజార్చినంత మాత్రాన అతడిపై గౌరవం ఏమీ పోదు. ఈ మ్యాచ్‌లో మేం ఓడినా సరే ఆ గౌరవం అలాగే ఉంటుంది’’ అని గిల్ వెల్లడించాడు.